



తుమ్మలపెంటలో కోతకు గురైన సముద్రతీరం

కసురు మీదున్న సముద్రం

కావలి రూరల్ : దిత్వా తుఫాన్ ప్రభావంతో కసురు మీదున్న సాగరతీరం కల్లోలంగా మారింది. కావలి మండలం తుమ్మలపెంట, కొత్తసత్రం సముద్రతీరం ఆదివారం 50 అడుగుల మేర ముందుకు రావటంతోపాటు 5 అడుగుల మేర అలలు ఎగసి పడుతున్నాయి. దీంతో మెరైన్ పోలీసులు పర్యాటకులను సముద్రస్నానాలకు రాకుండా బీచ్ సందర్శనను నిలిపివేసి రోడ్డుకు తాళ్లు, బారికేడ్లు అడ్డుపెట్టి గస్తీ నిర్వహిస్తున్నారు. మెరైన్ ఎస్ఐ జానకిరామయ్య సిబ్బందితో గస్తీ నిర్వహిస్తూ మత్స్యకారులను వేటకు వెళ్లకుండా చూడటంతో పాటు బోట్లు కొట్టుకు పోకుండా తీరానికి దూరంగా చేర్చారు.

● **సోమశిల నీటిమట్టం తగ్గింపు**

అనంతసాగరం: దిత్వా తుఫాన్ ప్రభావంతో ఎగువ నుంచి ఏక్షణమైనా వరద వచ్చే సూచనలు ఉండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమైంది. సోమశిలలో ఉన్న నీటినిల్వను తగ్గించేలా చర్యలు తీసుకున్నారు. ప్రస్తుతం జలాశయానకి వరద కొనసాగుతోంది. ఆదివారం ఉదయం 14,569 క్యూసెక్కులు వస్తుండగా, మధ్యాహ్నానికి తగ్గుముఖం పట్టి 10 వేల క్యూసెక్కులుగా నమోదైనట్లు అధికారులు తెలిపారు

● **కండలేరులో నీటి నిల్వ 58.06 టీఎంసీలు**

రాపూరు : మండలంలోని కండలేరు డ్యాం నీటి నిల్వ సామర్థ్యం 68 టీఎంసీలు కాగా, ప్రస్తుత నీటి మట్టం 58.06 టీఎంసీలుగా ఉన్నదని ఏఈ అనిల్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. సోమశిల నుంచి 2300 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వస్తుండగా, 1080 క్యూసెక్కుల అవుట్ ఫ్లో ఉందని ఆయన తెలిపారు.

విద్యుత్ సిబ్బందికి సెలవులు రద్దు : ఎస్ఈ

నెల్లూరు(జడ్పీ) : దిత్వా తుఫాన్ ప్రభావం జిల్లాపై ఎక్కువగా ఉండే అవకాశమున్నందున, ప్రజలకు విద్యుత్ ఇబ్బందులు ఏర్పడకుండా ఉండేందుకు సిబ్బందికి సెలవులు రద్దు చేశామని ఎస్ఈ రాఘవేంద్రం తెలిపారు. ఆదివారం ఆయన చాంబర్ నుంచి జిల్లా అధికారులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తుఫాన్ జిల్లాపై ఎక్కువ ప్రభావం చూపుతున్నదని, దీనిని దృష్టిలో ఉంచుకుని ప్రతి అధికారి, ఉద్యోగి, సిబ్బంది పూర్తి అప్రమత్తంగా ఉంటూ విద్యుత్ అంతరాయం కలగకుండా పటిష్ఠ చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలోని ఐదు విద్యుత్ డివిజన్లలో ప్రత్యేకంగా కంట్రోల్‌రూంలు ఏర్పాటు చేశామని, అవి 24 గంటలు పని చేస్తాయన్నారు. వర్షాలు తగ్గే వరకు ప్రతి సబ్ స్టేషన్‌లో ఇద్దరు సిబ్బందిని మాత్రమే ఉంచి, మిగిలిన వారిని అత్యవసర సేవలకు వినియోగించుకోవాలన్నారు.



నెల్లూరు : పెన్నానదిలో ప్రవహిస్తున్న వరద నీరు

ముసురు వాన

- తుఫాన్ వాతావరణంతో ప్రజల అవస్థలు
- నేడు విద్యాసంస్థలకు సెలవు
- విద్యుత్ ఉద్యోగులకు సెలవుల రద్దు
- నేడు, రేపు భారీ నుంచి అతిభారీ వర్షసూచన
- ప్రజలు అప్రమత్తంగా ఉండాలి : మంత్రులు ఆనం, నారాయణ

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం జిల్లా వ్యాప్తంగా ముసురేసింది. ఆగాగి రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురుస్తాయని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని జిల్లా మంత్రులు ఆనం రామనారాయణరెడ్డి, పొంగూరు నారాయణ, జిల్లా అధికారులు సూచించారు. వర్షంతో నెల్లూరులోని రోడ్లనీ చిత్తడి చిత్తడిగా మారాయి. మురుగు కాలువల్లో నీరు రోడ్డుపై పారింది. జిల్లాలో సగటు వర్షపాతం 3.3 మి.మీగా నమోదైంది. అత్యధికంగా పొదలకూరులో 15.8 మి.మీ, అత్యల్పంగా మనుబోలులో 0.8 మిమీ వర్షపాతం నమోదైంది. సోమ, మంగళవారాల్లో కూడా భారీ నుంచి అతి భారీవర్షాలు కురుస్తాయని వాతావరణశాఖ తెలిపింది.

● **అధికారులు అప్రమత్తంగా ఉండండి : ఆనం**

దిత్వా తుఫాన్‌ను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని రాష్ట్ర దేవదాయశాఖమంత్రి ఆనం రామనారాయణరెడ్డి అధికారులను ఆదేశించారు. ఆదివారం జిల్లా ప్రత్యేకాధికారి యువరాజ్‌తో కలిసి ఆయన కలెక్టరేట్‌లోని తిక్కనభవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ వ్యవసాయ అనుబంధ రంగాలు, రోడ్లు, భవనాలశాఖ, విద్యుత్‌శాఖ అధికారులంతా అప్రమత్తంగా ఉంటూ, జిల్లాలో నష్ట నివారణకు చర్యలు తీసుకోవాలన్నారు. రిజర్వాయర్లకు గండ్లు పడకుండా ఇరిగేషన్ అధికారులు నీటిని వాగుల ద్వారా ఎప్పటి కప్పుడు విడుదల చేస్తూ సముద్రంలో కలిసేలా చర్యలు తీసుకోవాలని ఆనం అన్నారు. జిల్లాలో ప్రాణ నష్టం ఆస్తినష్టం జరగకుండా అధికారులు అప్రమత్తతో వ్యవహరించాలన్నారు. వర్షాలకు అంటువ్యాధులు ప్రబలకుండా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ అజిత, జేసీ మొగిలి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యా సంస్థలకు సెలవు

నెల్లూరు(విద్య) : భారీ వర్షాల కారణంగా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటూ జేసీ మొగిలి వెంకటేశ్వర్లు ఆదేశాలతో డిసెంబరు 1(నేడు) అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలకు సెలవు ప్రకటించినట్లు డీఈవో డాక్టర్ ఆర్.బాలాజీరావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే జిల్లాలోని అన్నీ ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలలకు కూడా సెలవు ప్రకటిస్తున్న ఆర్ఐవో వరప్రసాద్‌రావు తెలిపారు.

● **నదీ పరివాహకంలో జాగ్రత్త : నారాయణ**

జిల్లాకు వాతావరణశాఖ ఆరెంజ్ అలెర్ట్‌ను జారీ చేసిందని, అధికారులు అప్రమత్తంగా వ్యవహరించి ఎలాంటి ఆస్తి, ప్రాణ నష్టం జరగకుండా జాగ్రత్త చర్యలు తీసుకోవాలని మంత్రి నారాయణ అధికారులను ఆదేశించారు. ఆయన క్యాంపు కార్యాలయం నుంచి అధికారులతో టెలీకాన్ఫరెన్స్ నిర్వహించారు. పెన్నా పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. దిత్వా వల్ల ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు.



టెలీకాన్ఫరెన్స్‌లో ఎస్ఈ రాఘవేంద్రం



కావలి వైకుంఠపురంలోని చాకలివీధిలో నిల్వ చేరిన వర్షపునీరు



కావలి-ఉదయగిరి రహదారిలో మినీ స్టేడియం ఎదురుగా రోడ్డుపై ఉన్న వర్షపునీరు



కలెక్టరేట్‌లోని తిక్కన భవన్‌లో అధికారులతో మాట్లాడుతున్న మంత్రి ఆనం రామనారాయణరెడ్డి, పక్కన ప్రత్యేక అధికారి యువరాజ్, ఎస్పీ అజిత, జేసీ వెంకటేశ్వర్లు తదితరులు

ఇన్‌ఫార్మర్లలో భయం

- పెంచలయ్య హత్యతో ఉలికిపాటు
- పోలీసులపై దాడితో పెరిగిన ఆందోళన
- సమాచారం ఇచ్చేందుకు వెనుకడుగు

నెల్లూరు(క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ప్రశాంతతకు మారుపేరుగా ఉన్న నెల్లూరు జిల్లా కొన్నేళ్లుగా నేరాలకు అడ్డాగా మారింది. హత్యలు, హత్యాయత్నాలు, దొంగతనాలు, దోపిడీలు, కత్తులతో బెదిరింపు, గంజాయి మత్తులో రక్తపాతం... ఇలా చెప్పుకుంటూపోతే జిల్లా నిత్యం నేరాలతో రాష్ట్రస్థాయి వార్తల్లో నిలుస్తోంది. జిల్లాలో జరుగుతున్న వరుస ఘటనలతో ప్రజలు భయాందోళలకు గురవుతున్నారు. నెల్లూరు రూరల్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగిన సీపీఎం నేత పెంచలయ్య హత్యతో పోలీసులకు ఆయా ప్రాంతాల్లో ఇన్‌ఫార్మర్లగా పని చేస్తున్న వారు ఉలిక్కిపడ్డారు.



● **భరోసా ఏదీ..?**

పెంచలయ్య హత్యతో జిల్లాలో ఆయా పోలీసు స్టేషన్‌ల పరిధిలో పోలీసులకు దగ్గరగా ఉంటూ, నేరాల నియంత్రణకు కృషి చేస్తున్న ఎంతోమంది సామాన్యులు, ఇన్‌ఫార్మర్లలో భయాందోళన చోటు చేసుకుంది. అంతేకాక పెంచలయ్యను హత్య చేసిన నిందితులు పోలీసులపైనే కత్తితో దాడి చేయడంతో ఆ భయం మరింత పెరిగింది. పెంచలయ్య హత్య జరక్క ముందు, ఆయనకు కామాక్షి గ్యాంగ్‌తో గొడవలున్నాయని, వారి వల్ల పెంచలయ్య ప్రాణాలకు ముప్పు ఉందన్న విషయం పోలీసులకు ముందే తెలిసినా, నిర్లక్ష్యం వహించారని స్థానికులు చెబుతున్నారు. పెంచలయ్య హత్యకు ముందే పోలీసులు కామాక్షి గ్యాంగ్‌ను పిలిపించి వార్నింగ్ ఇవ్వడం, బైండోవర్ చేసుకోవడం చేసుంటే, ఇంతగా వారు బరితెగించి ఉండేవారు కాదని పెంచలయ్య కుటుంబ సభ్యులు, వామపక్షాల నాయకులు చర్చించుకుంటున్నారు. నేరాల నియంత్రణ, అసాంఘిక కార్యకలాపాలు జరుగుతుంటే పోలీసులకు సమాచారం అందించండి... మీ వివరాలు బయటకు రావు.. మీకు ఎలాంటి హాని జరగదు... అంటూ పోలీసులు నిత్యం చెబుతుంటారు. అయితే మేమున్నామన్న భరోసాను మాత్రం ప్రజలకు ఇవ్వడంలో వారు విఫలమవుతున్నారు.

పెంచలయ్య హత్య కేసు నిందితుల అరెస్టు

నెల్లూరురూరల్ : సీపీఎం నేత వీ. పెంచలయ్య హత్య కేసులో నిందితులను పోలీసులు ఆదివారం అరెస్టు చేశారు. ఇందులో 14 మందికి ప్రమేయం ఉండగా, ఏడుగురిని రూరల్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరో ఐదుగురిని పట్టుకునేందుకు ప్రత్యేక బృందాలు గాలిస్తున్నాయి. ఈ ఘటనకు కారకురాలైన అరవ కామాక్షిని నవాబుపేట పోలీసులు గంజాయి కేసులో అరెస్ట్ చేశారు. పోలీసు కాల్పుల్లో గాయపడ్డ జేమ్స్ జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. ఈ కేసు వివరాలను రూరల్ డీఎస్పీ శ్రీనివాసరావు, సీఐ గుంజి వేణు విలేకరులకు వెల్లడించారు. అరెస్టు అయిన వారిలో రూరల్లోని 4వ మైలుకి చెందిన నాగుల జానకిరాం, తడికల బజార్‌కి చెందిన దారా విష్ణువర్ధన్, ఆర్టీటీ కాలనీ వాసి హత్య కేసులో ముద్దాయిగా ఉన్న అరవ సంతోష్, రంగనాయకులపేట వద్ద ఉన్న ఉప్పరపాళెం వాసి మిందాల లోహిత్ అలియాస్ చింటు, శెట్టిగుంట రోడ్డులో ఉంటున్న సస్పెక్ట్ షీట్ ఉన్న ఈగ వినయ్, నవాబుపేట పాత చెక్‌పోస్టు ప్రాంతానికి చెందిన కల్లూరు సంతోష్, బోడిగాడితోటకి చెందిన అరవ జోసెఫ్ ఉన్నారు. వీరి దగ్గర నుంచి ఒక్కొక్క కత్తి, హత్యకు వినియోగించిన మరో రెండు కత్తులు, మూడు బైకులను స్వాధీనం చేసుకున్నట్లు పోలీసు అధికారులు పేర్కొన్నారు. మృతుడి భార్య దుర్గ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలిస్తున్నట్లు వారు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వేదాయపాళెం సీఐ శ్రీనివాసులు, రూరల్ ఎస్సైలు లక్ష్మణరావు, సుధీర్, సిబ్బంది పాల్గొన్నారు.





రూరల్ పోలీస్‌స్టేషన్‌లో విలేకరులతో మాట్లాడుతున్న రూరల్ డీఎస్పీ శ్రీనివాస్‌రావు, హత్యకు వాడిన కత్తులను పరిశీలిస్తున్న డీఎస్పీ

● **ఆ కీలక వ్యక్తి ఎవరు ?**

పెంచలయ్యను హతమార్చడంలో అరవ కామాక్షితో పాటు మరో కీలక వ్యక్తి సహాయ, సహకారాలు అందించారని రూరల్ పోలీసులు పేర్కొన్నారు. ఆ వ్యక్తి ఎవరన్నది కీలకంగా మారింది. కామాక్షికి అడుగడుగునా రాజకీయంగా సహకరిస్తువస్తున్నది ఎవరనేది రాజకీయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. వెనుకబడిన తరగతుల పేరిట సంఘాలు స్థాపించి, రాజకీయంగా లబ్ధి పొందుతూ కామాక్షికి సహకరిస్తూ, ఆమెను నేర సామ్రాజ్యానికి అధిపతిని చేసింది ఇతనేనన్న ప్రచారం పెంచలయ్య హత్య సంఘటనతో వెలుగులోకి వచ్చింది. అతని ప్రమేయంపై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. త్వరలోనే అతన్ని అదుపులోకి తీసుకునే అవకాశం ఉంది.

● **కామాక్షిపై పీటీ వారెంట్ ?**

పెంచలయ్య హత్యలో అరవ కామాక్షి పాత్ర కీలకం కావడంతో ఆమెను అదుపులోకి తీసుకుని సమగ్రంగా విచారించేందుకు రూరల్ పోలీసులు సిద్ధమవుతున్నారు. ఈ మేరకు న్యాయస్థానంలో పీటీ వారెంట్ వేసి, ఆమెను అదుపులోకి తీసుకునేందుకు రంగం సిద్ధ చేశారు. కాగా, జీజీహెచ్‌లో చికిత్స పొందుతున్న నిందితుడు జేమ్స్ డిశ్చార్జి కాగానే అరెస్ట్ చేసేందుకు రూరల్ పోలీసులు ఏర్పాట్లు చేశారు.

ఎట్టకేలకు మోక్షం!



- ఇఫ్కో భూముల్లో ఇండస్ట్రియల్ పార్కు ఏర్పాటుకు అనుమతి
- రూ.870 కోట్లతో అభివృద్ధి చేసేందుకు నిర్ణయం
- ఈ భూముల్లోనే రూ.356 కోట్లతో ఇథనాల్ పరిశ్రమ
- డిసెంబరు 30న ప్రజాభిప్రాయ సేకరణకు సన్నాహాలు

నెల్లూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సుమారు మూడు దశాబ్దాల నిరీక్షణకు తెరపడబోతోంది. ఎట్టకేలకు ఇఫ్కో కిసాన్ సెజ్ భూములకు మోక్షం లభించింది. భూములిచ్చిన వారికి పరిహారం చెల్లింపు అంశాలు ఇంకా కొన్ని కోర్టులో పెండింగ్ ఉన్నా, ఆ భూముల్లో పరిశ్రమల ఏర్పాటుకు ఉన్న అడ్డంకులు మాత్రం తొలగాయి. తొలుత భూములను కేటాయించింది ఎరువుల పరిశ్రమ కోసం కాగా, ఇప్పుడు ఆ భూములను పారిశ్రామిక పార్కుగా మార్చి వివిధ రకాల పరిశ్రమలు నెలకొల్పేందుకు ఇఫ్కో యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ మేరకు ఇటీవల విశాఖలో జరిగిన పారిశ్రామిక సదస్సులో ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నట్లు ఇఫ్కో వర్గాలు చెబుతున్నాయి.

● **రూ.870 కోట్లతో నిర్మాణం**

ఇఫ్కో ఆధీనంలోని 2,776 ఎకరాల్లో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు అవసరమైన మౌలిక వసతులను రూ.870 కోట్లతో కల్పించేలా అధికారులు సిద్ధమవుతున్నారు. ఇందుకు సంబంధించి పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణకు నోటీసు కూడా జారీ చేశారు. డిసెంబరు 30న ఈ అభిప్రాయ సేకరణ ప్రక్రియ జరగనుంది. అన్నీ వసతులతో పారిశ్రామిక పార్కు ఏర్పాటు పూర్తయితే అనేక పరిశ్రమలు ముందుకొచ్చే అవకాశాలు పుష్కలంగా ఉన్నాయి. ఇప్పటికే ఇఫ్కో కిసాన్ సెజ్‌లో 29 ఎకరాల్లో ఇథనాల్ పరిశ్రమ నెలకొల్పేందుకు రామ్కీ బయో ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ముందుకొచ్చింది. రూ.356 కోట్లతో నిర్మాణం కాబోతున్న ఈ పరిశ్రమకు సంబంధించి కూడా డిసెంబరు 30న పర్యావరణ ప్రజాభిప్రాయ సేకరణ జరగనుంది. ప్లగ్ అండ్ ప్లే విధానంతో ఇఫ్కో భూముల్లో పరిశ్రమలు ఏర్పాటు చేసి సుమారు 70 వేల ఉద్యోగాలు సృష్టించాలని ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది.

● **కేసుల పరిష్కారం**

కొడవలూరు మండలంలోని రేగడిచెలిక, రాచర్లపాడు, బొడ్డువారిపాలెం గ్రామాలు, దగదర్తి మండలంలోని చౌటపుత్తేడు, ఉీచగుంటపాలెం, తడకలూరు గ్రామాలు, అల్లూరు మండలంలోని నార్త్ ఆములూరు గ్రామాల పరిధిలో ఇఫ్కో కిసాన్ సెజ్‌కు 30 ఏళ్ల క్రితం భూములు కేటాయించారు. అయితే అనుకున్న విధంగా ఎరువుల పరిశ్రమ ఏర్పాటు కాలేదు. ఆ తర్వాత భూములిచ్చిన రైతులు తమకు పరిహారం అందించలేదని హైకోర్టును ఆశ్రయించారు. ఇంకొందరు భూములు తీసుకున్న లక్ష్యానికి విరుద్ధంగా పరిశ్రమలు ఏర్పాటు చేయాలని చూస్తున్నారంటూ కేసులు వేశారు. ఈ కారణాలతో ఆ భూములు నిరుపయోగంగా మారాయి. ఆయా కేసులు ఇటీవల పరిష్కారమైన నేపథ్యంలో ఇఫ్కో భూముల్లో పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సన్నాహాలు మొదలయ్యాయి.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 650

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర రూ.12,257

వెండి కిలో ధర రూ. 1,76,300

వెండి ఒక గ్రాము రూ.181.30

అస్మిత అథ్లెటిక్స్ లీగ్ ఎంపికలు వాయిదా

నెల్లూరు(విద్య), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : భారత ప్రభుత్వం, అథ్లెటిక్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా సంయుక్తంగా నిర్వహించే అచీవింగ్ స్పోర్ట్స్ మైల్‌స్టోన్ బై ఇన్‌స్పైరింగ్ ఉమెన్ త్రూ ఆక్షన్(అస్మిత) ఎంపికలను తుఫాన్ కారణంగా తాత్కాలికంగా వాయిదా వేసినట్లు జిల్లా అథ్లెటిక్స్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కే.వెంకటేశ్వర్లు, అరిగెల విజయ్‌కుమార్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. వర్షాలు తగ్గిన అనంతరం రాష్ట్ర, జిల్లా కమిటీల ఆదేశాల మేరకు కొత్త తేదీలను ప్రకటిస్తామని పేర్కొన్నారు.

6 నుంచి చాగంటి ప్రవచనాలు

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): శ్రీభరద్వాజ రుద్రాభిషేకం సంఘం ఆధ్వర్యంలో టౌనుహాలులో ఈనెల 6 నుంచి 10వ తేదీ వరకు ప్రముఖ ఆధ్యాత్మిక ప్రవచన గురువులు చాగంటి కోటేశ్వరరావు ప్రవచనాలు జరుగుతాయని ఆడిటర్ ఎస్‌వీఎస్ రాఘవేంద్రరావు ఒక ప్రకటనలో తెలిపారు.

ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా విభజన

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : గూడూరును జిల్లా చేయాలి.. లేదా నెల్లూరులో కలపాలని.. ప్రజల అభీష్టానికి వ్యతిరేకంగా తిరుపతిలో కలుపుతామంటే ఒప్పుకునేది లేదని బీజేపీ నాయకుడు రంగా రెడ్డి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. రాపూరు, కలువాయి ప్రాంతాలను ఎందుకు విడగొడుతన్నారని, విడగొట్టమని ఎవ్వరు అడిగారని, తిరుపతిలో కలుపమని చెప్పింది ఎవ్వరని ఆయన కూటమి ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను నెల్లూరు జిల్లాలోనే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కూటమి పెద్దలను గౌరవిస్తామని, అయితే కూటమి పేరుతో ప్రజలకు అన్యాయం చేస్తే సహించేది లేదని, అందరినీ కలుపుకొని పోరాటం చేస్తామని పేర్కొన్నారు.

విభజనతో జిల్లాకు అన్యాయం జరిగితే పోరాటం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : విభజన విషయంలో నెల్లూరు జిల్లాకు అన్యాయం జరిగితే పోరాటం చేస్తామని ఆర్పీఐ జిల్లా అధ్యక్షుడు ఎస్‌కే మాబు చెప్పారు. ఆదివారం నగరంలోని ఆర్పీఐ కార్యాలయంలో ఆ పార్టీ కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మాబు మాట్లాడుతూ విభజన వలన అన్యాయం జరుగుతోందన్నారు. పోరాటానికి అందరూ సిద్ధంగా ఉండాలన్నారు.

కొనసాగుతున్న హనుమాన్ చాలీసా పారాయణం

నెల్లూరు (సాంస్కృతికం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని శబరి శ్రీరామ క్షేత్రంలో శాంతి కోసం హనుమాన్ చాలీసా పారాయణం కొనసాగుతోంది. హనుమద్ వ్రతం పర్వదినం పురస్కరించుకుని విజయవాడ అఖిల భారత హనుమ దీక్షా పీఠం కళాకారులు 72 గంటలపాటు నిరంతరంగా కొనసాగిస్తున్నారు. మంగళవారం వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుంది.

దిత్వా తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

● రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ



సండే మార్కెట్‌లో పనులు పరిశీలిస్తున్న మంత్రి నారాయణ

నెల్లూరు(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ప్రతి క్షణం అప్రమత్తంగా ఉండాలని పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ ఆదేశించారు. ఆదివారం ఆయన పార్టీ శ్రేణులు, అధికారులతో సమీక్ష నిర్వహించారు. తుఫాన్ పై ఎప్పటి కప్పుడు అధికారులను అడిగి తెలుసుకుంటూ ప్రజలకు అందుబాటులో ఉం డాలని కోరారు. దిత్వా తుఫాన్ వల్ల ఎటువంటి విపత్కర పరిస్థితినైనా ఎదుర్కొనేందుకు సిద్ధం గా ఉండాలన్నారు. ప్రజలకు ఎలాంటి అవసరం ఉన్నా వెంటనే శరవేగంగా పనులు చేపట్టి ఆదుకోవాలని సూచించారు.

● నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

నెల్లూరు(సిటీ) : అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని రాష్ట్ర పురపాలక శాఖ మంత్రి పొంగూరు నారాయణ తెలిపారు. ఆదివారం ఆయన నగరంలోని పలు ప్రాంతాల్లో పర్యటించారు. సండేమార్కెట్ వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, ఆత్మకూరు బస్టాండ్ అండర్ బ్రిడ్జి వద్ద జరుగుతున్న రోడ్డు నిర్మాణ పనులు, సిరి థియేటర్ వద్ద కమ్యూనిటీ హాలు, బృందావనంలో సీసీరోడ్డు పనులను అధికారులతో కలిసి పరిశీలించారు. రోడ్డు నిర్మాణ పనులు నాణ్యత ప్రమాణాలు పాటించడంతోపాటు త్వరగా పూర్తి చేసి ప్రజలకు ఇబ్బంది లేకుండా చేయాలని ఆదేశించారు. అనంతరం 13వ డివిజన్ పరిధిలోని ప్రణతి అపార్టుమెంట్ వద్ద డ్రైన్లను పరిశీలించారు. అక్కడి నుంచి 8వ డివిజన్‌కు వెళ్లిన ఆయన రేబాల వారి వీధిలో ఉన్న పార్కును పరిశీలించారు. స్థానికుల అభ్యర్థనతో డ్రైను నిర్మించాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమాలలో మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ నందన్, నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులరెడ్డి, మున్సిపల్ మాజీ చైర్‌పర్సన్ తాళ్లపాక అనూరాధ, టీడీపీ నగర అధ్యక్షుడు మామిడాల మధు, నాయకులు కప్పిర శ్రీనివాసులు, రేవతి, స్థానిక డివిజన్ల కార్పొరేటర్లు, తదితరులు పాల్గొన్నారు.

రూ.2.5 కోట్లతో నెక్లెస్ రోడ్డు మరమ్మతులు



నెక్లెస్‌రోడ్డును పరిశీలిస్తున్న నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నగరంలోని మూలాపేట గణేష్ ఘాట్ మరమ్మతులకు తొలి విడతగా రూ.2.5కోట్లతో ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తెలుగుదేశం నాయకుడు కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డిలు తెలిపారు. ఆదివారం అధికారులతో కలసి వారు గణేష్ ఘాట్‌ను సందర్శించారు. మొదటి దశలో రూ.2.5కోట్లతో ఎన్టీఆర్ నెక్లెస్ రోడ్డు, గణేష్ ఘాట్ నందు దెబ్బతిన్న రోడ్ల నిర్మాణం, ముఖద్వారాల నిర్మాణం, పార్కు అభివృద్ధి, సెంట్రల్ లైటింగ్‌ను అభివృద్ధి చేస్తామని తెలిపారు. నగర ప్రజలకు ఆహ్లాదకరమైన ప్రాంతంగా అన్ని విధాల అభివృద్ధి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మేయర్ నందిమండలం భానుశ్రీ, 41వ డివిజన్ కార్పొరేటర్ విజయలక్ష్మి, 41వ డివిజన్ టీడీపీ అధ్యక్షుడు ఉచ్చూరు సురేష్, నాయకులు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రచయితలకు సన్మానం

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఇండియన్ మెడికల్ హాలులో ఆదివారం పెళ్లకూరు జయప్రద సోమిరెడ్డి నవలా అవార్డు, జమునా స్మారక నానీల సంపుటి అవార్డు ఉత్సవాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో నవలా రచయిత మేఘనాథ్‌రెడ్డికి నానీల సంపుటి రచయిత కంచనపల్లి రవికాంత్‌కు నగదు బహుమతితోపాటు ఘనసత్కారం జరిగింది. డాక్టర్ పెళ్లకూరు జయప్రద రచించిన మెడికల్ కథలు, అవ్వారు శ్రీధర్‌బాబు రచించిన నానీల సంపుటిలు ఆవిష్కరించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ప్రముఖ కవి కొండ్రెడ్డి వెంకటేశ్వరరెడ్డి, ఎం.రామిరెడ్డి, సుంకర గోపాల్, శ్యామ్ ప్రసాద్‌లు ఆ పుస్తకాలను ఆవిష్కరించారు. అవార్డు పొందిన నవల, నానీలపై సుంకర గోపాల్, పెన్నా రచయితల సంఘం అధ్యక్షురాలు గోవిందరాజు సుభద్రాదేవి, తేట సులోచన, ఇంద్రగంటి మధుసూదన్‌లు సమీక్షించారు. ఈ కార్యక్రమంలో గంగిశెట్టి శివకుమార్, మోపూరు పెంచలనరసింహం, తదితరులు పాల్గొన్నారు.

పెంచలయ్య హత్యకు సీపీఎం నిరసన



నిరసన తెలుపుతున్న సీపీఎం శ్రేణులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం కార్యకర్త పెంచలయ్య దారుణ హత్యకు సీపీఎం నెల్లూరు రూరల్ కార్యదర్శి కొండా ప్రసాద్, జిల్లా కమిటీ సభ్యులు పెంచల నర్సయ్య ఆధ్వర్యంలో ఆదివారం నగరంలోని 23, 24వ డివిజన్‌లో నిరసన ప్రదర్శన చేపట్టారు. నేతలు మాట్లాడుతూ కల్లూరుపల్లి ఆర్డీడీ కాలనీలో ప్రశాంతమైన వాతావరణం ఏర్పాటు చేసి అక్కడ ప్రజలు గంజాయి బారిన పడకుండా పెంచలయ్య చైతన్యం చేస్తుండే వారన్నారు. దీంతో కక్షకట్టిన గంజాయి ముఠా కిరాతకంగా హత్య చేసిందన్నారు. నిందితులను పోలీసులు కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మంగళవారం పెంచలయ్య హత్యకు నిరసనగా జిల్లా బంద్ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జనసేన నేత కిశోర్, సీపీఎం నేతలు బంగోలు సుధీర్, షాహినాబేగం, సుధాకర్, శంషాద్, సురేష్, కామయ్య, వీర్ల శ్రీనివాసులు పాల్గొన్నారు.

కోటేశ్వరరావు సేవలు ఘనం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : ఎన్‌డీసీసీబీలో సహాయ మేనేజర్‌గా పనిచేస్తూ ఉద్యోగ విరమణ చేసిన సీ.కోటేశ్వరరావు సేవలు ఘనమైనవని జిల్లా కేంద్ర సహకార బ్యాంకు ఎంప్లాయిస్ అసోసియేషన్ జిల్లా నాయకులు ఫణీంద్రబాబు, గౌస్‌బాషా కొనియాడారు. ఆదివారం ఆ అసోసియేషన్ ఆధ్వర్యంలో డీసీసీబీలో కోటేశ్వరరావుకు సన్మాన కార్యాక్రమం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రైతులకు, ఖాతాదారులకు ఆయన ఘనమైన సేవలు అందించారన్నారు. ఈ కార్యక్రమంలో శివ, తదితరులు పాల్గొన్నారు.

జాతీయ ఆర్చరీ పోటీల్లో జిల్లాకు పతకాలు

నెల్లూరు(విద్య), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): అరుణాచలప్రదేశ్ ఐతానగర్‌లో జరుగుతున్న 42వ ఎన్‌టీపీసీ సబ్‌జూనియర్ జాతీయ ఆర్చరీ పోటీల్లో జిల్లాకు చెందిన ఆర్చరీ క్రీడాకారులు మూడు పతకాలు సాధించారు. ఇండియన్ రౌండ్ 30 మీటర్ల విభాగంలో జీ.వెంకటలోకేష్ రజిత పతకంతో పాటు ఓవరాల్ ఛాంపియన్‌గా మరో రజత పతకం సాధించారు. అలాగే ఆర్చరీ టీమ్ విభాగంలో జీ.వెంకటలోకేష్ జీ.మహిధర్‌లు రజత పతకం సాధించారని జిల్లా ఆర్చరీ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు పల్లంరెడ్డి శ్రీహర్ష, పావురాల వేణులు తెలిపారు. జిల్లా తరపున పాల్గొని రాష్ట్రానికి మూడు పతకాలు సాధించడం గర్వకారణమని, ఇదే స్ఫూర్తితో మున్ముందు మరిన్ని విజయాలు సొంతం చేసుకునేలా సాధన చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా క్రీడాకారులతో పాటు కోచ్ టీ.శివశంకర్, మేనేజర్ వీ.భరద్వాజరెడ్డిలను అభినందించారు.

కామేశ్వరరావుకు ఘన నివాళి

నెల్లూరు(జడ్పీ), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): విద్యుత్ ఉద్యోగుల సంక్షేమం కోసం ఉద్యమాలు చేసి ఆత్మ బలిదానం చేసుకున్న ఎస్‌ఏఎఫ్ కామేశ్వరరావుకు విద్యుత్ భవన్‌లో ఆదివారం ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఎస్‌ఈ రాఘవేంద్రం, ఇతర అధికారులు నివాళులర్పించారు. అనంతరం ఎస్‌ఈ మాట్లాడుతూ ఉద్యోగుల హక్కుల కోసం పోరాట పథంలో అడుగుపెట్టిన కామేశ్వరరావు ఆత్మబలిదానం చేసుకుని ఉద్యోగుల జీవితాల్లో వెలుగులు నింపారన్నారు. ఉద్యోగులంతా గౌరవప్రదమైన స్థితిలో ఉండడానికి, హక్కులు, సంక్షేమం, సౌకర్యాలు పొందడానికి కామేశ్వరరావు త్యాగఫలమేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఈఈలు శేషాద్రిబాలచంద్ర, ఎం.శ్రీధర్, డీఈలు మునీంద్ర, కృష్ణారెడ్డి, శ్రీనివాసులు పాల్గొన్నారు.

పెంచలయ్యను చంపింది ముమ్మాటికీ వైసీపీ వాళ్లే..

● నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి



ఆదాల, ఆనంతో కామాక్షి ఉన్న ఫొటోను చూపుతున్న ఎమ్మెల్యే శ్రీధర్‌రెడ్డి

నెల్లూరురూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : గంజాయి వ్యతిరేక ఉద్యమకారుడు పెంచలయ్యను అత్యంత క్రూరంగా చంపింది ముమ్మాటికి వైసీపీకి చెందిన గంజాయి బ్యాచ్ అని నెల్లూరురూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి స్పష్టం చేశారు. ఆదివారం నగరంలోని తన కార్యాలయంలో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ 2024 సార్వత్రిక ఎన్నికల్లో అరవ కామాక్షి, ఆమె అనుచరులు వైసీపీ గెలుపునకు పని చేశారని, ఆపై కూడా ఆ పార్టీలోనే కొనసాగుతున్నారని తెలిపారు. ఈ నిజాన్ని దాచిపెట్టి వైసీపీ రూరల్ ఇన్‌చార్జి ఆనం విజయకుమార్ రెడ్డి వారంతా టీడీపీ వాళ్లేనని పచ్చి అబద్ధాలు మాట్లాడటం తగదన్నారు. నెల్లూరుకు వచ్చిన జగన్ పర్యటనలోనూ అల్లరిమూకలను సమకూర్చినది కామాక్షి అని చెప్పారు. పైగా తమ పార్టీ నాయకుడు పెంచలయ్యను చంపింది వైసీపీ మూకలేనని ఏకంగా సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ ప్రకటించిన విషయాన్ని తెలుసుకోవాలని హితవు పలికారు. ఓ సీనియర్ కార్పొరేటర్ ద్వారా ఇదే గంజాయి బ్యాచ్ నుంచి రూ.5 లక్షలు ఆనం విజయకుమార్‌రెడ్డికి జగన్ పర్యటన ఖర్చులకు చేరినట్లు ప్రచారం జరుగుతుందని తెలిపారు. ఆర్డీటీ కాలనీలో టీడీపీ, సీపీఎంలు కలిసి గంజాయికి వ్యతిరేకంగా పోరాడుతున్నాయని, వీరికి వ్యతిరేకంగా వైసీపీ ఉందన్నారు. వైసీపీ అభ్యర్థిగా ఎన్నికల్లో పోటీకి దిగిన ఆదాల గెలుపునకు కామాక్షి, పాలకీర్తి రవి, జేమ్స్‌లు పని చేశారని సాక్షాత్తు ఆనం విజయకుమార్‌రెడ్డి తాజాగా ప్రకటించి మళ్లీ వాళ్లంతా టీడీపీ వాళ్లేనని చెప్పడం ఆయన విజ్ఞతకే వదిలేస్తున్నానన్నారు. రూరల్లో హత్యరాజకీయాలు ఎవరు చేశారో ఏ గ్రామానికి వెళ్లి అడిగినా చెప్తారన్నారు. గంజాయి, డ్రగ్స్, భూకబ్జాలకు వ్యతిరేకంగా కలిసి వచ్చే పార్టీలతో తాను ఉద్యమం చేస్తానని ప్రకటించారు. పెంచలయ్య హత్య కేసుతో తమకు సంబంధం ఉన్నట్లు సీపీఎం నాయకులు చెబితే వారు ఏం చెప్పిన చేసేందుకు తాము సిద్దంగా ఉన్నామన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నేత గిరిధర్‌రెడ్డి, రూరల్ ఎస్సీ సెల్ అధ్యక్షుడు అరవ శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

'పినాకినీ తీరం'లో పుస్తకావిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఈతకోట సుబ్బారావు కవితా సమాలోచనలను డాక్టర్ సోమసుందర్ అవంతి రచించిన పినాకినీ తీరంలో కవితా ఘలంఘలలు పుస్తకావిష్కరణ నగరంలోని ఓ హోటల్‌లో ఆదివారం జరిగింది. ఆ పుస్తకాన్ని రచయిత, విమర్శలు ఎంవీ.రామిరెడ్డి ఆవిష్కరించి తెలుగు సాహిత్యంలో డాక్టర్ సోమసుందర్ అవంతి ఒక లెజెండ్ అన్నారు. సాహిత్య చరిత్రకు ఇటువంటి ప్రముఖుల రచనలు, వ్యాసాలు ఎంతో అవసరమన్నారు. ఈతకోట సుబ్బారావు కవిత్వంపై సమీక్షలు, వ్యాసాలు వచ్చినప్పటికీ సోమసుందర్ సుదీర్ఘ వ్యాసం సాహిత్య విలువలతో ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఈతకోట సుబ్బారావు, విశాలాక్షి సంపాదకులు కోసూరు రత్నం, రచయిత్రి ఎస్‌వీ.నాగగాయత్రి, స్కాలర్ రామకృష్ణ, దంపూరు రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

నేటినుండి 'వార్డు వార్డుకు తెలుగుదేశం'

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారం కోసం ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఆదేశాల మేరకు బుచ్చిరెడ్డిపాళెంలో సోమవారం నుంచి 'వార్డు వార్డుకూ తెలుగుదేశం' కార్యక్రమం నిర్వహించనున్నారు. ప్రతీ వార్డులో ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా ఈనెల 1వ తేదీ నుంచి 20వ తేదీ వరకు ఈ కార్యక్రమం జరగనుంది. మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్మన్, కౌన్సిలర్లు, టీడీపీ అర్బన్ అధ్యక్షుడు, కూటమి నాయకులు పాల్గొననున్నారు.

బస్ షెల్టర్‌లో మంటలు

పొదలకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని తోడేరు బ్రాంచ్ రోడ్డు పక్కన ఉన్న బస్సు షెల్టర్‌లో ఆదివారం మధ్యాహ్నం మంటలు వ్యాపించాయి. ఈ మంటలు ఎలా రేగాయో అంతు పట్టడం లేదు. ఇక్కడ భిక్షగాళ్లు, ఆశ్రయం లేని వాళ్లు ఉంటుంటారు. వారికి సంబంధించిన వస్తు వులు కాలిపోయి ఉంటాయని భావిస్తు న్నారు.

కండలేరు డ్యాం మట్టికట్టపై ముళ్ల చెట్లు



కట్టపై పెరిగిన ముళ్ల పొదలు

పొదలకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : ఆసియా ఖండంలోనే అతిపెద్దదైన కండలేరు మట్టికట్టపై కొంత కాలంగా పిచ్చి మొక్కల తొలగింపు ప్రక్రియ చేపట్టలేదు. దీంతో చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి. పలు చోట్ల వాటి వేర్లు కట్టలోపలికి చొచ్చుకొనిపోయాయి. జీపు ట్రాక్ గుంతల మయంగా మారింది. వర్షపు నీరు కిందకు పోయేందుకు ఏర్పాటు చేసిన సూట్లు దెబ్బతిన్నాయి. నీరు వెళ్లే మార్గానికి అడ్డంకులు తొలగించకపోవడంతో పైనుంచి నీరు పారి కట్ట బలహీనపడింది. గతంలో ప్రతి ఏటా పిచ్చిమొక్కలను తొలగించేవారు. ఏడాదిన్నరగా తొలగించక పోవ డంతో చిట్టడివిలా మారింది. ఇప్పటికైనా ఈ మట్టి కట్టపై ఉన్న ముళ్ల చెట్లను తొలగించాలని స్థానికులు కోరుతున్నారు.

పంట కాలువలకు మోక్షం!



కాగులపాడు కాలువలో పూడిక తీస్తున్న ఎక్సకవేటర్

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): బుచ్చి మున్సి పాలిటీతోపాటు మండలంలోని వ్యవసాయ పొలాల్లో పంటకాలువలకు పూడిక తీస్తుండడంతో నిన్నటి వరకు చుక్కనీరు పారడం కష్టతరమైన కాలువలకు మోక్షం కలిగింది.. దీంతో అన్నదాతల్లో హర్షం వ్యక్తమవుతోంది. జిల్లా వ్యాప్తంగా ఏళ్ళ తరబడి పంట కాలువలు పూడికతీతకు నోచుకోక కరకట్టలను మించిన గడ్డి, గుర్రపుడెక్కతో అరణ్యాన్ని తలపించాయి. దీంతో పంట పొలాలకు రావాల్సిన సాగునీరు లోతట్టు ప్రాంతాల్లోకి వెళుతూ వృథా అవుతోంది. పలువురు నీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్లు, రైతుల విన్నపంతో కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి వీపీఆర్ ఫౌండేషన్ నిధులతో కొన్ని కాలువల్లో ఎక్స్‌కవేటర్‌తో పూడికతీత పనులు చేయించారు. దీనికితోడు నీటిపారుదల శాఖ ద్వారా పలువురు నీటి సంఘాల అధ్యక్షులు, డైరెక్టర్ల ఆధ్వర్యంలో బుచ్చితో పాటు అన్ని మండలాల్లో పంట కాలువలు పూడికతీతకు నోచు కుంటున్నాయి. నీటి సంఘాల అధ్యక్షుల ఆధ్వర్యంలో అన్ని పంట కాలువల్లో పూడిక తీయి స్తున్నట్లు ఇరిగేషన్ ఏఈ శ్రీనివాసులు తెలిపారు.

చివరి ఆయకట్టుదాకా సాగునీరు

20 ఏళ్ళ నుండి పూడికతీతకు నోచుకోని కాలువలతోపాటు, మిగిలిన వాటిలోనూ పూడిక తీయిస్తున్నారు. ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి చొరవతో పెను బల్లి, మినగల్లు, కాగులపాడు గ్రామాల్లో ప్రతి పంట కాలువలో నీరు ప్రవహించనుంది. దీంతో కనిగిరి రిజర్వాయర్ దగ్గర నుండి ప్రతి పంట కాలువ కింద చివరి ఆయకట్టు దాకా చుక్క నీరు కూడా వృథా కాకుండా సాగునీరు పారే అవకాశం కలిగింది.

- గుమ్మా విష్ణువర్ధన్, నీటి సంఘం అధ్యక్షుడు, పెనుబల్లి

రాపూరు ఘాట్.. యమ డేంజర్!

ఇకకైనా కొత్త రోడ్డు నిర్మాణం, విస్తరణ జరిగేనా?



ఘాట్ రోడ్డులో ప్రమాదానికి గురైన ఆర్టీసీ బస్సులు(ఫైల్)

రాపూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరు, అన్నమయ్య జిల్లాల సరిహద్దు ప్రాంతమైన రాపూరు ఘాట్ రోడ్డులో ప్రయాణం అంటేనే ప్రయాణికులు భయంతో వణికిపోతున్నారు. ఎప్పుడెప్పుడు రాపూరు ఘాట్ దాటి చిట్వేల్ ఘాట్ లోకి ప్రవేశిస్తామా.. అని ఎదురు చూసే పరిస్థితి ఏర్పడింది. రోడ్డు పరిస్థితి మరీ అధ్వానంగా మారింది. రోడ్డు నిర్వహణ కూడా సరిగా లేకపోవడం వల్ల ఎదురుగా వచ్చే వాహనాల వేగం పరిమితికి మించితే ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయి. ప్రతి రోజు అనేక మంది ఉద్యోగాలు, వ్యాపారాల రీత్యా రెండు జిల్లాల వారు ప్రయా ణం ఈ రోడ్డులో ప్రయాణిస్తుంటారు. ఘాట్ రోడ్డులో ప్రయాణం అంటే అనుభవం తప్పనిసరిగా ఉండాలి. అలాంటి డ్రైవర్లకే ముచ్చెమటలు పడు తున్నాయి. ఈ దారిలో 15 కిలో మీటర్ల ఘాట్ ప్రయాణంలో జిల్లా సరిహద్దు అవతల అన్ని హంగులతో ఆధునీకరించగా, నెల్లూరు జిల్లా సరిహద్దులో రోడ్డు గుంతలమయమైంది. రక్షణ గోడలు కూలిపోయాయి. చిన్న పొరపాటు జరిగినా వాహనాలు అదుపు తప్పి లోయలోకి దూసుకుపోయే పరిస్థితి ఏర్పడింది. గతంలో నిర్మించిన రక్షణ గోడలు శిథిలం కాగా, చాలా ఏళ్లుగా కొత్త రక్షణ గోడలు నిర్మించకపోవడంతో ఘాట్ ప్రయాణం ప్రమాదకరంగా మారింది. ఆర్ అండ్‌బీ అధికారులు ఎమర్జెన్సీ కింద తూతూ మంత్రంగా నాసిరకమైన పనులు చెయ్యడం పరిపాటి అయిపోయింది. ప్రమాదాలు జరిగిన తర్వాత హడావిడి చెయ్యడం లాంటివి కాకుండా, ముందు జాగ్రత్తగా సాధ్యమైనంత త్వరలోనే నూత న రోడ్డు నిర్మాణం, విస్తరణ చెయ్యాలని రెండు జిల్లాల ప్రజలు కూటమి ప్రభు త్వాన్ని కోరుతున్నారు.

తృటిలో తప్పిన పెను ప్రమాదం...

ఆదివారం ఘాట్ రోడ్డులో తృటిలో ప్రమాదం తప్పింది. రాపూరు నుండి కడపకు వెళ్లే బస్సు, కదిరి నుండి నెల్లూరు వెళ్లే బస్సు 13 కి.మీ మేరకు ఎదురెదురుగా ఒకదానికొకటి దగ్గరగా రాసుకుంటూ వచ్చి ఆగిపోయాయి. దీంతో పెను ప్రమాదం తప్ప డంతో ప్రయాణికులు ఊపిరి పీల్చుకున్నారు. రెండు బస్సులలో కలిపి 70 మంది ప్రయాణిస్తుండగా, ఎవరికీ ఎటు వంటి గాయాలు కాలేదు. ప్రయాణంలో కొంతవరకు అంతరా యం ఏర్పడగా, విషయం తెలుసుకున్న ఆర్టీసీ సిబ్బంది, బస్సులను అక్కడినుంచి తొలగించారు.

దాతల సహకారంతో అభివృద్ధి పనులు

● మనుబోలు, అక్కంపేటలో వాటర్‌ప్లాంట్లను ప్రారంభించిన ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి



మహిళలకు శుద్ధిజలాన్ని అందిస్తున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

మనుబోలు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సర్వేపల్లి నియోజకవర్గంలో దాతలు, పారిశ్రామిక వేత్తల సహకారంతో పేదలు నివసించే ప్రాంతాలు, గిరిజన కాలనీల్లో అభివృద్ధి పనులు చేయిస్తున్నామని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి పేర్కొన్నారు. మండలంలోని మనుబోలు గిరిజన కాలనీ, అక్కంపేట శ్రీరామ్‌నగర్ కాలనీలో చెన్నూరుకు చెందిన మెట్టు రవీంద్రరెడ్డి ఆయన తండ్రి చంద్ర శేఖర్ రెడ్డి జ్ఞాపకార్థం రూ.10 లక్ష లతో ఏర్పాటు చేసిన రెండు వాటర్‌ప్లాంట్లను ఎమ్మెల్యే ఆదివారం ప్రారంభించారు. మంచినీరు నింపి క్యాన్లను మహిళలకు అందజేశారు. ఎమ్మెల్యే సోమిరెడ్డి మాట్లాడుతూ గిరి జనుల అభ్యున్నతిపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. దాతల సహకారంతో కాలనీలకు అన్ని వసతులు కల్పిస్తున్నామన్నారు. గత వైసీపీ ప్రభుత్వం గిరిజనుల అభివృద్ధిని విస్మరిం చిందన్నారు. మంచినీటి సౌకర్యం కల్పించిన దాత మెట్టు రవీంద్రరెడ్డికి ప్రత్యేక అభినందనలు తెలిపారు. ఇంకా మండలంలో మూడుచోట్ల ఆయన ప్లాంట్లను నిర్మిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు పొన్నూరు రామకృష్ణయ్య, కేసీపీసీ చైర్మన్ మస్తాన్‌నాయుడు, నాయకులు మెట్టు యాచేంద్ర సాయి రెడ్డి, ఎల్లసిరి శ్రీధర్‌రెడ్డి, ఏకొల్లు కోదండరామిరెడ్డి, వేణుగోపాల్‌రెడ్డి, అమీర్ బాషా, పచ్చిపాల రామి రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, వెంకటరమణయ్య, ప్రసాద్, రమణారెడ్డి, కిరణ్ కుమార్ పాల్గొన్నారు.

గంజాయి మాఫియా ఆగడాలు అరికట్టాలి

బుచ్చిరెడ్డిపాళెం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గంజాయి మాఫియా ఆగడాలను పూర్తిగా అరికట్టాలని సీపీఎం నాయకులు డిమాండ్ చేశారు. ఆదివారం బుచ్చిరెడ్డిపాళెంలోని సీపీఎం కార్యాలయంలో సీపీఎం, సీఐటీయూ నాయకులు గంజాయి మాఫియా చేతిలో హత్యకు గురైన కామ్రేడ్ పెంచలయ్య చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పించారు. పట్టణంలో కొవ్వొత్తులతో ప్రదర్శన నిర్వహించారు. సీపీఎం నాయకులు వెంకమరాజు, శ్రీనివాసులు, మల్లికార్జున, సురేష్ పాల్గొన్నారు.

'గండికోట'కు కృష్ణారావు సాహితీ పురస్కారం

బుచ్చిరెడ్డిపాళెం మున్సిపాలిటీ రామచంద్రాపురం ప్రాథమికోన్నత పాఠశాల ఉపాధ్యాయుడు గండికోట సుధీర్‌కుమార్ మండలి వెంకటకృష్ణారావు కవితా సాహితీ పురస్కారం అందుకున్నారు. ఆదివారం ఒంగోలులోని ఎన్టీఆర్ కళాక్షేత్రంలో మాజీ మంత్రి మండలి వెంకటకృష్ణారావు శతజయంతి వేడుకలు, కళామిత్రమండలి (తెలుగులోగిలి) 19వ వార్షికోత్సవం నిర్వహించారు.

తుఫాన్ పట్ల అప్రమత్తంగా ఉండాలి

తోటపల్లిగూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : దిత్వా తుఫాను ప్రభావంతో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్‌ఐ తెలిపారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుంచి బయటకు రాకుండా, సురక్షిత ప్రాంతాల్లో ఉండాలని కోరారు. విద్యుత్ తీగలు తెగిపడినట్లు లేదా స్తంభాలు కూలినట్లు గమనిస్తే వాటిని తాకకుండా వెంటనే విద్యుత్ శాఖ లేదా స్థానిక పోలీసులకు సమాచారం అందించాలన్నారు. కోడూరు బీచ్‌కు పర్యాటకులు ఎవ్వరు రావద్దని కోరారు. మత్స్యకారులు వేటకు వెళ్లవద్దన్నారు.

ఇక.. దర్శనం వేగంగా.. సేవలు సులభంగా..!

రాపూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పెంచలకోనలో ఆలయ సేవలు మరింత సులభం కానున్నాయి. రాష్ట్ర ప్రభుత్వం, దేవాదాయ ధర్మాదాయ శాఖ ఆధ్వర్యంలో భక్తులకు మరింత సౌకర్యం కల్పించేందుకు పలు ప్రముఖ దేవస్థానాల్లో సేవలు, దర్శనం, ప్రసాదం, వసతి బుకింగ్ లకు "ఆన్‌లైన్ సేవల బుకింగ్ వ్యవస్థ" అందుబాటులోకి తీసుకొని వచ్చింది. ఇందులో భాగంగానే పెంచలకోన క్షేత్రము నందు శ్రీవారి దర్శనం, ఆర్జిత సేవలు, వసతి, ప్రసాద సేవలను 'వాట్సాప్, వెబ్ సైట్ ద్వారా బుక్ చేసుకొనే సౌకర్యాన్ని కల్పిస్తున్నామని ఆలయ ఉప కమిషనర్ పొరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు. వాట్సాప్ నెంబర్ 9552300009, వెబ్ సైట్ డబ్ల్యూ.బ్ల్యూ.బ్ల్యూ ఏపీటెంపుల్స్ ఓఆర్జీ/ఈఎన్-ఇన్/హోమ్ ద్వారా ఈ సేవలను ఉపయోగించుకోవచ్చన్నారు.



'బెంగాలీ' లేబర్స్.. వరినాట్లు అదుర్స్..!

సాలుసాలుగా.. చూడముచ్చటగా.. స్కేలుతో గీత గీసినంత అందంగా.. నాట్లు వేసే కష్టజీవులు వాళ్లు! వరి పైర్లకు మన సైన అతిథులు వాళ్లు. ఇక్కడి భాష రాకపోయినా.. ఎంచక్కా సైగలతో వరినాట్లు వేసే శ్రమైక జీవన సౌందర్య భాష.. ఈ అన్నల సొంతం. వాళ్లే పశ్చిమబెంగాల్ వలస కూలీలు. నెల్లూరు జిల్లాలో వ్యవసాయకూలీల కొరత తీరుస్తున్న ఆపద్బాంధవులు. నిరంతర శ్రమ...సేద్యపు నైపుణ్యం వీళ్ల ఆభరణాలు. అందరూ పురుషులే.. అయితేనేం..? మహిళల కన్నా అద్భుతంగా.. స్థానిక కూలీల కంటే తక్కువ ధరకు వరినాట్లు వేస్తున్నారు. స్థానిక కూలీలు ఎకరంలో వేసే 30 కిలోల వరినార్లను.. బెంగాలీ కూలీలు రెండెకరాల విస్తీర్ణంలో వేస్తుండడంతో వీరికి డిమాండ్ బాగా పెరిగింది. ఇది ఇక్కడి రైతులకు కూడా లాభసాటిగా మారింది. ఏడాది చివర్లో అక్టోబర్, నవంబర్, డిసెంబర్ నెలల్లో జిల్లాకు వలస వచ్చి.. వరినాట్లు పూర్తయ్యాక తిరిగి సొంతూళ్లకు వెళ్లిపోతారు. 'పొట్టకూటి కోసం నెల్లూరు ప్రాంతానికి వచ్చాం... కూలీ గిట్టుబాటు అవుతుంది' అంటూ సంబరపడిపోతున్నారు ఈ బెంగాలీ శ్రమజీవులు.

- జలదంకి(ఆంధ్రజ్యోతి)

నిమ్మ ధరల పతనం

● ఉత్తరాదిన తగ్గిన డిమాండ్

పొదలకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిమ్మకాయలను ఇంతకుముందులా అడిగేవారులేరు. ఇక్కడి వ్యాపారులు ఎగుమతులు చేస్తామంటే, ఢిల్లీ వ్యాపారులు ఇప్పుడే వద్దంటున్నారు. దీంతో కాయలకు డిమాండ్ పడిపోయి రైతులు ఆవేదన చెందుతున్నారు. ఓవైపు పోటీ పెరగడంతో పొదలకూరు, గూడూరు మార్కెట్ల నుంచి కాయలు ఎగుమతి కావడంలేదు. లూజు (బస్తా) రూ.400 నుంచి రూ.600 మాత్రమే ఉంది. కిలో రూ.10కూడా ధరలు పలకడంలేదని వ్యాపారులు తెలిపారు. పొదలకూరు పరిసర ప్రాంతాల్లో నిమ్మపై జీవిస్తున్న రైతులు సుమారు 2వేల మంది వరకు ఉంటారు. 5వేల ఎకరాల్లో తోటలు సాగవుతున్నాయి. కాగా కొన్ని గ్రామాల్లో రైతులు తోటలు తీసేసి, ఇతర వ్యవసాయ పనులు చేసుకుంటున్నారు.

నేడు కలెక్టరేట్ పీజీఆర్ఎస్ రద్దు

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కలెక్టరేట్‌లో సోమవారం జరగాల్సిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని దిత్వా తుఫాన్ కారణంగా తాత్కాలికంగా రద్దు చేసినట్లు జేసీ వెంకటేశ్వర్లు ఓ ప్రకటనలో తెలిపారు.

పోలీసు పీజీఆర్ఎస్ కూడా..

నెల్లూరు(క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక(పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని తుఫాన్ కారణాలతో రద్దు చేశామని ఎస్పీ డాక్టర్ అజిత వేజెండ్ల ఓ ప్రకటనలో తెలిపారు. అర్జీదారులు వారి అర్జీలను మీకోసం.ఏపీ.జీవోవీ.ఇన్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవచ్చని పేర్కొన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.

నియంత్రణ ఏదీ..?

● స్వచ్ఛంద సంస్థలున్నా ఫలితమేది..
● హెచ్ఐవీ బాధితుల్లో సగం మందికి పెన్షన్ లేదు
● ఆరేళ్లుగా బస్సు పాసులూ లేవు...
● జిల్లాలో వ్యాధిగ్రస్థులు 12 వేలమంది
● నేడు ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం

నెల్లూరు (వైద్యం) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి : హెచ్ఐవీ(ఎయిడ్స్) వ్యాధి జిల్లాలో తగ్గినట్టే తగ్గి, చాపకింద నీరులా వ్యాపిస్తూనే ఉంది. 2002తో పోలిస్తే జిల్లాలో 17.08 శాతం నుంచి 0.03 శాతానికి వ్యాధి తగ్గిందంటే, అది ప్రభుత్వం తీసుకున్న చర్యలేనని తెలుస్తోంది. అయితే ఆరేళ్లుగా వ్యాధి నివారణపై ప్రభుత్వం దృష్టి పెట్టక పోవటంతో ప్రతినెలా వ్యాధిగ్రస్థులు 50 మంది నమోదవుతున్నట్లు తెలుస్తున్నది. దీంతో ప్రస్తుతం జిల్లాలో అధికారికంగా 12వేలమంది వరకు ఎయిడ్స్ బాధితులు ఉన్నారు. డిసెంబరు 1న (నేడు) ప్రపంచ ఎయిడ్స్ నివారణ దినం సందర్భంగా ఎయిడ్స్ వ్యాప్తిలేని వివక్ష రహిత సమాజాన్ని నిర్మిస్తామంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ పిలుపునిచ్చింది.

● ఏటా రూ. 20 లక్షలకుపైగా ఖర్చు

జిల్లాలో ఎయిడ్స్ నియంత్రణకు కేంద్రం న్యాకో ద్వారా ఏటా రూ. 20 లక్షలు ఇస్తున్నది. నెల్లూరు కేంద్రంగా ఎస్ఎస్ఎంఏఎస్ స్వచ్ఛంద సంస్థతోపాటు దీనికి అనుబంధంగా మరో రెండు సీసీఎస్ సంస్థలు పనిచేస్తున్నాయి. అలాగే కావలిలో సాస్ స్వచ్ఛంద సంస్థ పనిచేస్తున్నది. వీటిలో ఒక్కొక్క దానికి ఏటా రూ. 5లక్షలకు పైగా కేంద్రం నిధులు అందిస్తున్నది. ఆయా సంస్థలు ఎయిడ్స్ ప్రబలే వర్గాల్లో చైతన్యం తీసుకు రావాలి. సెక్స్ వర్కర్స్‌ను, ట్రాన్స్‌జెండర్స్‌ను కలవాలి. వారిలో ఎయిడ్స్ గురించి చైతన్యం తీసుకురావాలి. శృంగారంలో పాల్గొనేటప్పుడు ఎలాంటి జాగ్రత్తలు తీసుకుకోవాలని అనే అంశంపై ప్రచారం చేయాలి. దీంతోపాటు అనుమానితులను జిల్లాలో ఉన్న ఎయిడ్స్ నిర్ధారణ కేంద్రాలకు తీసుకు వెళ్లి, పరీక్షలు చేయించాలి. అయితే ఆయా సంస్థలు కార్యక్రమాల అమలులో నిర్లక్ష్యం వహిస్తున్నట్లు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. దీంతో కేంద్రం నిధులు, విధుల లక్ష్యాలు నేరవేరడం లేదన్న వాదన వినిపిస్తోంది.

● ప్రభుత్వ పరంగా వైద్యసేవలు..

జిల్లా ఎయిడ్స్ నివారణ విభాగం ఆధ్వర్యంలో ఏడు హెచ్ఐవీ కౌన్సెలింగ్, పరీక్ష కేంద్రాలు పని చేస్తున్నాయి. శిక్షణ పొందిన కౌన్సెలర్లు హెచ్ఐవీ పరీక్షలకు ముందు, తరువాత సలహాలిస్తారు. సుఖవ్యాధులు ఉన్న వారిలో 10 శాతం మందికి హెచ్ఐవీ సోకే అవకాశం ఉన్నందున, నెల్లూరు జీజీహెచ్, కావలి, కందుకూరు ఏరియా ఆసుపత్రుల్లో సుఖ వ్యాధుల చికిత్సా కేంద్రాలను ఏర్పాటు చేశారు. వ్యాధిగ్రస్థులకు ఉచితంగా మందులు అందించేందుకు జీజీహెచ్‌లో యాంటి రిట్రోవైరస్ థెరపి(ఏఆర్‌టీ) సెంటర్‌ను ఏర్పాటు చేశారు. దీనికి అనుబంధంగా కావలి ఏఆర్‌టీ సెంటర్ పని చేస్తున్నది. కాల్ సెంటర్ 1097కు ఫోన్ చేసి వైద్య సేవలు పొందాలని అధికారులు చెబుతున్నారు.

హెచ్ఐవీ పరీక్షల ద్వారా నమోదైన వ్యాధిగ్రస్థులు

సంవత్సరం	పరీక్ష చేయించుకుంది	వ్యాధిగ్రస్థుల నిర్ధారణ	శాతం
2020- 21	70,966	577	0.8
2021- 22	1,50,457	710	0.5
2022- 23	1,91,042	811	0.4
2023 - 24	1,10,538	465	0.4
2024 - 25	179588	735	0.4
2025 - 26	102929	358	0.3



జీజీహెచ్‌లో ఉన్న ఏఆర్‌టీ సెంటర్

● సగం మందికి పింఛన్ ఏదీ ?

జిల్లాలో వ్యాధిగ్రస్థులు 12వేల మంది ఉండగా, వీరిలో 3వేల మందికి మాత్రమే పెన్షన్ చెల్లిస్తున్నారు. ఆరేళ్లయినా నేటికి 50 శాతం మందికి కూడా పెన్షన్ రాలేదు. బాధితులు కలెక్టరేట్, తహసిల్దార్ కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నా ఎలాంటి ఫలితం ఉండటం లేదు. ఇదిలా ఉంటే ఏఆర్‌టీ సెంటర్‌కు ప్రతినెలా మందులు కోసం వచ్చేందుకు గత టీడీపీ ప్రభుత్వం వీరికి బస్‌పాసులు మంజూరు చేసేది. అయితే గత వైసీపీ ప్రభుత్వం వచ్చిన తర్వాత వాటిని రద్దు చేసింది. దీంతో బాధితులు మందులు కోసం రూ. వందలు ఖర్చు చేయాల్సి వస్తున్నది.

నియంత్రణకు పక్కా చర్యలు

జిల్లాలో హెచ్ఐవీ నియంత్రణకు పక్కాగా చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం జిల్లా ప్రజలకు వ్యాధిపై పూర్తిస్థాయి అవగాహన వచ్చింది. ఎయిడ్స్ నియంత్రణలో స్వచ్ఛంద సంస్థలు చక్కగా చేస్తున్నాయి. పెన్షన్, బస్‌లను ప్రభుత్వం చూసుకోవాల్సి ఉంది.



- డాక్టర్ ఖాదర్‌వలి, జిల్లా క్షయ నియంత్రణ అధికారి

భూవివాదంలో అడ్డు తొలగించుకునేందుకే ప్రసాద్ నాయుడి హత్య

● సూత్రధారితో సహా ఆరుగురు నిందితుల అరెస్ట్
● రెండు నెలలుగా రెక్కీ.. మూడు పర్యాయాలు విఫలం
● చివరకు ఒంటరిగా ఉండగా కోళ్ల ఫారంలోనే హత్య



హత్య కేసు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ శ్రీధర్

కావలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఆర్థిక, భూ వివాదాల పరిష్కారానికి తరచూ అడ్డు తగులుతున్నాడని కిరాయి హంతకుల చేత జలదంకి మండలం గట్టుపల్లి చింతల పాలెంకు చెందిన గొట్టిపాటి ప్రసాద్‌నాయుడిని నవంబరు 26వ తేదీన హత్య చేయించినట్లు పోలీసులు నిర్ధారించారు. హత్య సూత్రధారి కృష్ణా జిల్లా నాగాయలంకకు చెందిన తలసిల వెంకటనరసింహారావుతో పాటు కిరాయి హంతకులు కొక్కిలగడ్డ వెంకటరావు, తిరుమలశెట్టి డ్యానియేలు, పీత ప్రవీణ్‌కుమార్, లంకే నరసింహరాజు, సైకం నరేంద్రలను ఆదివారం మధ్యాహ్నం కావలి పట్టణం మద్దూరుపాడు హైవే అండర్‌పాస్ వద్ద అరెస్ట్ చేసినట్లు కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ తెలిపారు. స్థానిక డీఎస్పీ కార్యాలయంలో ఆదివారం సాయంత్రం నిర్వహించిన విలేకరుల సమావేశంలో హత్య పూర్వాపరాలు, నిందితుల అరెస్టుకు సంబంధించిన వివరాలను డీఎస్పీ వెల్లడించారు.

కృష్ణ జిల్లా నాగాయలంకకు చెందిన తలసిల వెంకటనరసింహారావుకు, గారపాటి సదాశివరావుకు గట్టుపల్లి చింతలపాలెంలో భూవివాదం ఉంది. ఇందుకు సంబంధించిన ఆర్థిక లావాదేవీల విషయంలో వారిద్దరి మధ్య వివాదాలు ఉన్నాయి. అయితే ఈ వివాదంలో గట్టుపల్లి చింతలపాలెంకు చెందిన గొట్టిపాటి ప్రసాద్ నాయుడు సదాశివరావుకు మద్దతుగా ఉంటూ సమస్య పరిష్కారానికి అడ్డు తగిలేవాడు. సదాశివరావు చేత కేసులు పెట్టిస్తూ తరచు నరసింహారావును ఇబ్బందులు పెడుతుండేవాడు. దీంతో ప్రసాద్ నాయుడిని అడ్డు తొలగిస్తే సమస్య పరిష్కారం అవుతుందని నరసింహారావు భావించి, కిరాయి హంతకుల చేత ప్రసాద్ నాయుడి హత్యకు పథకం రూపొందించాడు.

రెండు నెలలుగా రెక్కీ.

ప్రసాద్ నాయుడిని హత్య చేయించేందుకు నేరచరిత్ర కలిగిన కృష్ణా జిల్లా పులిగడ్డ పల్లిపాలెంకు చెందిన రౌడీషీటర్ కొక్కిలగడ్డ వెంకటరావును వెంకటనరసింహారావు సంప్రదించాడు. కిరాయి హంతకులను సమకూర్చమని చెప్పాడు. దీంతో వెంకటరావు తన స్నేహితుడు, పలు హత్య కేసులలో ముద్దాయిగా ఉన్న రౌడీషీటర్ సైకం నరేంద్రను సంప్రదించాడు. దీంతో నరేంద్ర తనకు తెలిసిన నేరచరిత్ర కలిగిన డ్యానియేలు, నర్సింగ్‌రాజు, ప్రవీణ్‌కుమార్‌తో కలిసి హత్యకు పథకం పన్నాడు. గత రెండు నెలలుగా చింతలపాలెం వెళుతూ రెక్కీ నిర్వహించారు. మూడు పర్యాయాలు విఫలమై చివరకు కోళ్లఫారంలో ఒంటరిగా ఉన్న ప్రసాద్ నాయుడును నవంబరు 26వ తేదీ మధ్యాహ్నం కత్తులతో పొడిచి నరేంద్ర గ్యాంగ్ హత్య చేసింది. మృతుడి సోదరుడు గొట్టిపాటి వెంకటేశ్వర్లు ఫిర్యాదు మేరకు జలదంకి పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ కేసు ప్రాథమిక దర్యాప్తును కలిగిరి సీఐ పీ. వెంకటనారాయణ చేపట్టగా, జిల్లా ఎస్పీ డాక్టర్ అజిత వేజండ్ల ఆదేశాల మేరకు నెల్లూరు సీసీఎస్ సీఐ సీహెచ్ సీతారామయ్యను ప్రత్యేకాధికారిగా నియమించారు. ఎస్పీ ఆదేశాలతో ఆయన కావలి డీఎస్పీ పీ. శ్రీధర్ పర్యవేక్షణలో వేగంగా విచారణ చేపట్టారు. తగిన సాంకేతిక ఆధారాలను సేకరించి నిందితులను అరెస్ట్ చేశారు. ఈ కేసును త్వరితగతిన ఛేదించినందుకు జిల్లా ఎస్పీ ఈ ఆపరేషన్‌లో భాగమైన వారికి రివార్డులు ప్రకటించినట్లు కావలి డీఎస్పీ తెలిపారు. విలేకరుల సమావేశంలో కావలి డీఎస్పీతో పాటు నెల్లూరు సీసీఎస్ సీఐ సీహెచ్ సీతారామయ్య, కలిగిరి సీఐ వెంకటనారాయణ, కావలి ఒకటో పట్టణ, రెండో పట్టణ సీఐలు ఫిరోజ్, గిరిబాబు, జలదంకి ఎస్ఐ లతీఫున్నీసా తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ కోసం పని చేసినవారికే పట్టం

ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్యే హసన్ మౌలానా



సమావేశంలో హసన్ మౌలానా, చేవూరు, నాయకులు

కావలి (టౌన్) నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీని నమ్ముకుని పని చేసినవారికే పట్టం కడతామని కాంగ్రెస్ ఏఐసీసీ పరిశీలకులు, ఎమ్మెల్యే హసన్ మౌలానా పేర్కొన్నారు. జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు చేవూరు దేవ కుమార్ రెడ్డి అధ్యక్షతన నియోజకవర్గ ఇన్‌చార్జ్ కల్యాణ్ పర్యవేక్షణలో ఆదివారం స్థానిక కార్యాలయంలో కార్యకర్తలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఎమ్మెల్యే హసన్ మౌలానా మాట్లాడుతూ క్షేత్రస్థాయిలో కార్యకర్తల మనోభావాలను పరిగణనలోకి తీసుకుని నాయకులను ఎంపిక చేస్తామన్నారు. కాంగ్రెస్ పార్టీకి కార్యకర్తలే బలమని, దేశ నిర్మాణంలో కాంగ్రెస్ పాత్ర కీలకమన్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని అధికారంలో తెచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. పార్టీ బలోపేతానికి తీసుకోవాల్సిన చర్యలు, ప్రజా సమస్యలపై చేపట్టాల్సిన ఉద్యమాలపై కార్యకర్తలకు దిశా నిర్దేశం చేశారు. చేవూరు దేవకుమార్ రెడ్డి మాట్లాడుతూ పార్టీని అమ్ముకునేవారిని కాకుండా పార్టీని నమ్ముకున్నవారికి సంస్థాగతంగా సముచిత స్థానం కల్పిస్తామన్నారు. సమావేశంలో రాష్ట్ర నాయకుడు లేళ్ళపల్లి సురేష్‌బాబు, జిల్లా నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు



ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేస్తున్న హెచ్ఎంలు

నెల్లూరు(విద్య), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న ప్రధానోపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం పరిష్కరించాలని ఏపీ ప్రధానోపాధ్యాయుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుత్తా శ్రీనివాసరావు కోరారు. నగరంలోని బీవీనగర్ సంఘమిత్ర పాఠశాలలో ఆదివారం హెచ్ఎంల సంఘం నిర్వహించిన ప్లాటినం జూబ్లీ వేడుకలకు ముఖ్యఅతిథులుగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్‌తో పాటు శ్రీనివాసరావు పాల్గొని మాట్లాడారు. కామన్ సర్వీస్ రూల్స్ లేని కారణంగా జడ్పీ యాజమాన్యంలోని ప్రధానోపాధ్యాయులు, ఎంఈవోలు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. వీరికి ఉద్యోగోన్నతులు రాకుండా నిత్యం న్యాయస్థానాల చుట్టూ తిరిగేలా చేస్తూ న్యాయబద్ధంగా రావాల్సిన ఉద్యోగోన్నతులు రానీయడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రారంభించిన క్లస్టర్ పాఠశాలల విధానాన్ని బలోపేతం చేసేందుకు క్లస్టర్ ప్రధానోపాధ్యాయుడిని గ్రేడ్-1 హెచ్ఎంలుగా ఉన్నతీకరించి ప్రధానోపాధ్యాయులతో కలిపి ఉద్యోగోన్నతులు కల్పించాలన్నారు. హైస్కూల్ ప్లస్‌లకు ప్రిన్సిపాల్ పోస్టులను, డైట్ కళాశాలలకు లెక్చరర్ పోస్టులను, జూనియర్ లెక్చరర్ పోస్టులను, సమగ్రశిక్ష సెక్టోరియల్ అధికారుల పోస్టులను పదోన్నతుల ద్వారా భర్తీ చేయాలన్నారు. వీటితోపాటు ప్రతి పాఠశాలకు ఔట్‌సోర్సింగ్ పద్ధతిలో డిజిటల్ అసిస్టెంట్ పోస్టును, నాన్ క్లస్టర్ ఉన్నత పాఠశాలలకు కంప్యూటర్‌లను ఇవ్వాలని కోరారు. ఈ సమస్యలన్నింటిని ప్రభుత్వం దృషికి తీసుకెళ్లి పరిష్కరించా లని కోరుతూ ఎమ్మెల్సీ శ్రీకాంత్‌కు వినతిపత్రం అందజేశారు. దీనిపై ఎమ్మెల్సీ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యారంగం పట్ల, ఉపాధ్యాయుల పట్ల సానుకూలంగా ఉందని, అన్ని సమస్యలను వారికి తెలియచేసి పరిష్కరించేందుకు కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు పీ మాధవరావు, ప్రధాన కార్యదర్శి ఆర్.మురళీధర్, కోశాధికారి పీ బుజ్జయ్య, గౌరవాధ్యక్షుడు ఎంవీ.చలపతి, రాష్ట్ర నేతలు భాస్కర్‌రెడ్డి, శ్రీనివాసరావు, మాధవరావు, ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

రైతాంగ సమస్యలపై 10న నిరసన

వైద్య కళాశాలల ప్రైవేటీకరణపై 18న.. ● సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్‌కుమార్



సమావేశంలో అజయ్‌కుమార్, నాయకులు

నెల్లూరు(వైద్యం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై ఈ నెల 10వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా అన్ని మార్కెట్ యార్డుల వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమాలు చేపట్టనున్నట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు అజయ్‌కుమార్ తెలిపారు. ఆదివారం స్థానిక సీపీఐ జిల్లా కార్యాలయంలో జరిగిన జిల్లా కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడుతూ అలాగే రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్రంలో 17 వైద్య కళాశాలలను ప్రైవేటీకరణపై ఈనెల 18వ తేదీన నిరసన కార్యక్రమాలు చేపడుతున్నట్లు వెల్లడించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మిక, కర్షక వ్యతిరేక విధానాలు అమలు చేస్తున్నాయన్నారు. ఎక్కడ చూసినా నిరుద్యోగ సమస్య తీవ్రంగా ఉందని, దీన్ని తట్టుకోలేక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు వ్యతిరేకంగా పోరాటాలు చేస్తున్నారన్నారు. దీనివల్ల కొందరు నిరుద్యోగులు తప్పుదోవ పట్టే అవకాశం ఉందన్నారు. రైతులు ఎదుర్కొంటున్న సమస్యలు ఎక్కువగా ఉన్నాయని, పైగా ప్రకృతి కూడా పంట నష్టాలను కలుగచేస్తున్నాయన్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జగదీష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చటం లేదన్నారు. నేడు రాష్ట్రంలో ఎక్కడ చూసినా గంజాయి ముఠాల దోపిడీలు, దాడులు ఎక్కువయ్యాయన్నారు. వీటిని నివారించటంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందిందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా సహాయ కార్యదర్శి నందిపోగు రమణయ్య, మాలకొండయ్య, వినోదమ్మ తదితరులు పాల్గొన్నారు.

విద్యుత్ సమస్యలపై నేడు డయల్ యువర్ సీఎండీ

నెల్లూరు(జడ్పీ), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారం కోసం సోమవారం ఉదయం 10 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు డయల్ యువర్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రతి సోమవారం నిర్వహించే డయల్ యువర్ సీఎండీ కార్యక్రమం ద్వారా జిల్లా వినియోగదారుల సమస్యలు ఎప్పటికప్పుడు పరిష్కారమవుతున్నాయని పేర్కొన్నారు. 89777 16661కు కాల్ చేసి సమస్యలను తెలిపి పరిష్కారం పొందాలని తెలిపారు.

ఏపీ కోఆపరేటివ్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు స్థానం

నెల్లూరు(హరనాథపురం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): ఏపీ కోఆపరేటివ్ అసోసియేషన్ రాష్ట్ర కమిటీలో జిల్లాకు ప్రాతినిధ్యం లభించింది. ఆదివారం విజయవాడలో జరిగిన ఎన్నికల్లో జిల్లాకు చెందిన జీసీబీవీ కోటేశ్వరరావు కోశాధికారిగా ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. సహకార శాఖ ఉద్యోగుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని ఆయన తెలిపారు.

సర్వే ఉద్యోగుల సంఘం జిల్లా కార్యవర్గం ఎన్నిక

ఆంధ్రప్రదేశ్ సర్వే ఉద్యోగుల సంఘం జిల్లాశాఖ నూతన కార్యవర్గాన్ని ఆదివారం సర్వే శాఖ కార్యాలయంలో ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈ సంఘానికి అధ్యక్షుడిగా సీహెచ్ రాంకుమార్, కార్యదర్శిగా సీహెచ్ అంకయ్య, ఉపాధ్యక్షుడుగా ఏ.మహేష్ రెడ్డి, సంయుక్త కార్యదర్శిగా ఎస్.శ్రీనివాసులు, ట్రెజరర్‌గా ఆర్.యామిని జ్యోత్న ఎన్నికయ్యారు. అనంతరం వారు ప్రమాణ స్వీకారం చేశారు.

తల్లీకూతుళ్లపై దాడి

నెల్లూరు(క్రైం), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : తల్లీ కూతళ్లపై దాడికి పాల్పడిన ఘటనపై చిన్నబజారు పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పోలీసుల సమాచారం మేరకు.. నగరంలోని మూలాపేట కొండదిబ్బలో నివాసం ఉంటున్న మహేశ్వరికి మూడేళ్ల కింద ట విజయవాడకు చెందిన బాలాజీతో పెద్దల సమక్షంలో వివాహం చేశారు. విజయవాడలోని అశోక్‌నగర్‌లో అద్దె ఇంట్లో అత్తమామలతో కలిసి మహేశ్వరి దంపతులు నివాసం ఉంటున్నారు. వారికి రెండేళ్ల కుమారుడు ఉన్నాడు. వివాహం జరిగినప్పటి నుంచి మహేశ్వరితో అత్త శ్రీదేవి చిన్నచిన్న వియాలకు గొడవపడటంతోపాటు, అదనపు కట్నం కోసం అసభ్యకరంగా మాట్లాడుతూ హింసించేది. ఈ క్రమంలో నవంబరు 26వ తేది భర్త, అత్తలు ఇద్దరు కలిసి మహేశ్వరిను తిట్టి, కొట్టడంతో ఆమె నెల్లూరులోని తల్లిదండ్రుల వద్దకు వచ్చేసింది. ఈ క్రమంలో ఆమె అత్త నెల్లూరులోని జెండా వీధిలో తన చెల్లి కృష్ణవేణి ఇంటికి వచ్చింది. ఇక్కడ తెలిసిన వారికి మహేశ్వరి గురించి శ్రీదేవి చెడుగా ప్రచారం చేయడం ప్రారంభించింది. విషయం తెలుసుకున్న మహేశ్వరి, తన తల్లి శైలజ, చెల్లెలు కలిసి ఆదివారం శ్రీదేవి వద్దకు వెళ్లి దుష్ప్రచారంపై ప్రశ్నించారు. దీంతో శ్రీదేవి, తన చెల్లెలు కృష్ణవేణి కలిసి శైలజపై, అడ్డువచ్చిన కుమార్తె మహేశ్వరిపై దాడి చేశారు. దీంతో బాధితులు చిన్నబజారు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

దుత్తలూరు(ఉదయగిరి), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దుత్తలూరు సెంటర్ నందిపాడు మార్గంలో 565 జాతీయ రహదారిపై ద్విచక్ర వాహనాన్ని టిప్పర్ ఢీకొనడంతో ఓ వ్యక్తికి గాయాలైన సంఘటన ఆదివారం చోటుచేసుకొంది. వివరాల మేరకు.. దుత్తలూరు బీసీ కాలనీకి చెందిన కోనేటి వెంగయ్య తన ద్విచక్ర వాహనంపై నందిపాడు వైపు వెళుతుండగా టిప్పర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి గాయాలు కావడంతో హైవే అంబులెన్స్‌లో చికిత్స నిమిత్తం ఉదయగిరి ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

● బొలెరో ప్రమాదంలో నాలుగుకు చేరిన మృతుల సంఖ్య

కావలి రూరల్, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): అల్లూరు మండలం సింగపేట వద్ద ఈ నెల 17న గృహ నిర్మాణ కూలీలతో వెళ్తున్న బొలేరో వాహనం బోల్తాపడ్డ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి నెల్లూరులో చికిత్స పొందుతున్న మరో వ్యక్తి ఆదివారం మృతి చెందాడు. కావలి మండలం బట్లదిన్నెకు చెందిన చేబ్రోలు హజరత్తయ్య(37) తీవ్రగాయాలతో రెండు వారాలుగా మృత్యువుతో పోరాడి మృతి చెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలముకున్నాయి. మృతునికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. ప్రమాదంలో ఒక్కరు మినహా మిగిలినవారందరూ ఒకే గ్రామానికి చెందినవారు. ఘటనా స్థలంలోనే బట్లదిన్నెకు చెందిన బండ్ల ప్రసాద్, ఉప్పాల శీనయ్య మృతి చెందగా, తీవ్రగాయాలతో చికిత్స పొందుతూ నాలుగు రోజుల క్రితం నాగరాజు మృతి చెందాడు. తాజాగా హజరత్తయ్య మరణంతో మృతుల సంఖ్య నాలుగుకు చేరింది.

రైలుకింద పడి వ్యక్తి ఆత్మహత్య

రాపూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రైలు కింద పడి ఓ వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. రాపూరు మండలం మద్దూరుపల్లికి చెందిన మణి కుమార్ (34) రైలు కింద పడి ఆత్మహత్య చేసుకున్నాడు. కుటుంబ కలహాలతోనే మృతి చెందినట్లు భావిస్తున్నారు. రైల్వే పోలీసులు మృత దేహాన్ని స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

పెంచలయ్య హంతకులు గంజాయి ముఠానే..

● జిల్లా వ్యాప్తంగా సంతాప దినాలు
● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



మాట్లాడుతున్న సీపీఎం నేత మూలం రమేష్

నెల్లూరు(వైద్యం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి) : పెంచలయ్యను హత్య చేసింది గంజాయి ముఠానే అని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ పేర్కొన్నారు. సీపీఎం కార్యాలయంలో ఆదివారం జరిగిన విలేకరుల సమావేశంలో మాజీ డిప్యూటీ మేయర్ మాదాల వెంకటేశ్వర్లుతో కలసి ఆయన మాట్లాడారు. 24వ డివిజన్ కల్లూరుపల్లి ఆర్టీటీ కాలనీలో గత వైసీపీ నాయకురాలు అరవ కామాక్షి, ఆమె సోదరుడు జేమ్స్ గంజాయి అమ్మకాలు జోరుగా సాగిస్తున్నారన్నారు. ఇలాంటి వాటిని ఎదుర్కొనేందుకు పెంచలయ్య అక్కడ మంచి వాతావరణం నెలకొల్పుతూ ప్రజల్లో గంజాయికి వ్యతిరేకంగా అవగాహన కలిగిస్తున్నారన్నారు. దీన్ని తీవ్రంగా పరిగణించిన అరవ కామాక్షి గ్యాంగ్ స్కూటర్‌పై వెళుతున్న పెంచలయ్యను వెంబడించి హత్య చేయడం దారుణమన్నారు. దీనిపై జిల్లా వ్యాప్తంగా సోమ, మంగళవారాలు వివిధ పార్టీలు సంతాపాలు ప్రకటిస్తాయన్నారు. 2వ తేదీన జిల్లా బంద్‌కు కూడా పిలుపు నిచ్చామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా డ్రగ్స్ విచ్చలవిడిగా అమ్మకాలు జరుగుతూ ప్రత్యేకంగా యువతపై దీని ప్రభావం ఎక్కువగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేత మోహన్‌రావు, సీపీఐ ఎంఎల్ నేత రాంబాబు, వామపక్ష న్యాయవాది శివశంకర్, తదితరులు పాల్గొన్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	132
స్కిన్ చికెన్	240
స్కిన్‌లెస్	264

కోడిగుడ్ల ధర (100): 650

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)
ఒక గ్రాము ధర రూ.12257
వెండి కిలో ధర రూ. 176300
వెండి ఒక గ్రాము రూ.181.30

వైభవంగా అయ్యప్ప పడిపూజ

జలదంకి, నవంబరు30(ఆంధ్రజ్యోతి): జలదంకి మండలం బ్రాహ్మణక్రాక శివాలయంలో ఆదివారం అయ్యప్పస్వామి పడిపూజ వైభవంగా జరిగింది. వందలాది మంది అయ్యప్ప భక్తులు పూజల్లో భాగంగా భజన చేశారు. అయ్యప్పస్వామి, గణపతి, సుబ్రహ్మణ్య స్వామి ప్రతిమలను ప్రత్యేకంగా అలంకరించారు. 18 మెట్లు ఏర్పాటు చేసి శాస్త్రోక్తంగా పూజలు చేశారు. అనంతరం నిర్వాహకులు అన్నదానం ఏర్పాటు చేశారు.

కావలిలో భారీ వర్షం.. రోడ్లు జలమయం


పెదపవనిరోడ్డు- ఉదయగిరి రోడ్డులో ప్రవహిస్తున్న వాననీరు

కావలి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి) దిత్వా తుఫాన్ ప్రభావంతో ఆదివారం కావలిలో భారీ వర్షం కురిసింది. దీంతో కాలువలు, రోడ్లన్నీ జలమయమయ్యాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఆదివారం మధ్యాహ్నం నుంచి వర్షం దంచి కొట్టడంతో ప్రజలు ఇళ్లకే పరిమితమయ్యారు. మరికొందరు పనులపై బయటికి వచ్చి ఇబ్బందులు పడ్డారు. పట్టణంలో కాలువలన్నీ ఆక్రమణలకు గురై పూడికతో నిండిపోవటంతో వర్షపు నీరంతా రోడ్లపై నిల్వ ఉంటోంది. కావలి-ఉదయగిరి జాతీయ రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలు ఆక్రమణలకు గురి కావటంతో జనతాపేట, వెంగళరావునగర్ ప్రాంతంలో ఉన్న ఆ రోడ్డుపూర్తిగా జలమయమైంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడ్డారు. అలాగే ట్రంకు రోడ్డుకు ఇరువైపులా ఉన్న కాలువలు సైతం మూత బండలు, పూడికతో నిండిపోవటంతో అనేక ప్రాంతాలు జలమయమయ్యాయి. వైకుంఠపురంలోని అన్నపుగుంట ప్రాంతం ,శివాలయం రోడ్డు, సబ్‌కోర్టు వీధి, తుమ్మలపెంట రోడ్డు తదితర ప్రాంతాలలో ప్రజలు రాకపోకలకు ఇబ్బంది.

అల్లూరు : మండలంలో శనివారం రాత్రి నుండి ప్రారంభమైన వర్షం ఆదివారం రాత్రి వరకు ఎడతెరిపి లేకుండా కురుస్తోంది. ఇప్పటికే రైతులు వరినాట్లులో నిమగ్నమై ఉండడంతో వర్షం వ్యవసాయ పనులకు అడ్డంకిగా మారిందని రైతులు అంటున్నారు. లోతట్టు ప్రాంతాల్లోని భూముల్లో వరినాట్లుకు తీవ్ర ఆటంకం ఏర్పడనుంది. వరద నీరు ప్రవహిస్తే వేసిన నార్లు దెబ్బతినే అవకాశం ఉండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

జలదంకి: దిత్వా తుఫాను నేపథ్యంలో జలదంకి మండల తహసీల్దారు సీతామహాలక్ష్మీ, ఎస్ఐ లతీఫున్నీసా, ఏఓ శ్రీవాణిలు ప్రజలకు సోషల్ మీడియా ద్వారా సూచనలు ఇస్తున్నారు. జోరు వానలోనూ రైతులు మాగాణి భూముల్లో వరినాట్లు వేసేందుకు సిద్ధమయ్యారు. మరికొందరు కూలీలచే వరినాట్లు వేయిస్తున్నారు. నాటిన మడులలో నీరు బయటకు తీసి నాట్లు కుళ్ళిపోకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. వర్షం అధికమైతే సోమవారం పలు రోడ్లపై వాహన రాకపోకలు నిలిచిపోయే అవకాశాలున్నా యని మండల అధికారులు, వీఆర్వోలు తెలిపారు. వాగుల వద్ద గస్తీ ఏర్పాటు చేస్తున్నట్లు తహసీల్దారు, ఎస్ఐలు పేర్కొన్నారు.

విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

కలిగిరి, నవంబరు30 (ఆంధ్రజ్యోతి): కలిగిరి పంచాయతీ పరిధిలోని జిర్రావారిపాలెంలో శనివారం అర్ధరాత్రి ఇంట్లో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో అగ్నిప్రమాదం చోటు చేసుకుంది. ఈ ఘటనలో విద్యుత్ తీగలు పూర్తిగా దగ్ధం కావడంతో మంటలు చెలరేగాయి. సామాగ్రి, కొంత నగదు పూర్తిగా కాలిపోయాయి. ఇంటి యజమాని పాశం కొండలరావు అప్రమత్తమై తన ఇద్దరు పిల్లలతో ప్రాణాలతో బయటపడ్డాడు. భార్య చనిపోయి కూలి చేసుకుంటూ ఇద్దరు పిల్ల ల్ని పోషించుకుంటున్నానని, ప్రభుత్వం ఆదుకోవాలని బాధితుడు విన్నవించాడు.

నేడు పింఛన్ల పంపిణీ

ఉలవపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమానికి కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సోమవారం ఉదయం ఉలవపాడుకు వస్తున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు రాచగల్లు సుబ్బారావు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉలవపాడులోని మసీదు సెంటర్‌లో లబ్ధిదారుల ఇళ్ల వద్ద ఎమ్మెల్యే పింఛన్ల పంపిణీ చేపట్టనున్నందున మండలంలోని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని ఆయన కోరారు.

బీజేపీ మండల కన్వీనర్‌గా రాము


రాముతో మండల పార్టీ నాయకులు

ఉలవపాడు, నవంబరు 30 (ఆంధ్ర జ్యోతి): బీజేపీ మండల కార్యకర్తల సమావేశం ఆదివారం జరిగింది. మండల కన్వీనర్‌గా జీటీ రాముని ఎన్నుకున్నట్లు నాయకులు తెలిపారు.. ఈ కార్యక్రమంలో పొందూరి కృష్ణారెడ్డి, ఎలమంద, పాలూరి వెంకట్రావు, సత్యం, గాగేంద్ర, శ్రీధర్, కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యం

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కందుకూరులోని బూడిదపాలెం వెళ్లే రోడ్డు పక్కన ఆదివారం గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైనట్లు సీఐ అన్వర్ బాషా తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న వ్యక్తిని గుర్తించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించగా, ఏరియా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. పరిశీలించిన డాక్టర్ అప్పటికే అతను మరణించినట్లు నిర్ధారించారన్నారు. అతని గుండెలపై నరసింహా, యముడు అని పచ్చబొట్లు ఉన్నాయని, తెలిసిన వారు 9121102202, 91211022 03 నెంబర్లకు సమాచారమివ్వాలని కోరారు.

ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలి

● మొబైల్ టెక్నీషియన్లతో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి) : మొబైల్ టెక్నీషియన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు సూచించారు. ఆదివారం పట్టణంలోని వెంగమాంబ కల్యాణ మండపంలో జరిగిన కందుకూరు మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ ఆవిర్భావ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని లోగోను, ఐడీ కార్డులను పంపిణీ చేశారు. నేటి ప్రపంచంలో మొబైల్ రంగం కీలమని, విప్లవాత్మక మార్పులు చోటుచేసుకుంటున్నాయన్నారు. కందుకూరులో రూముల అద్దెలు ఎక్కువగా ఉన్నాయని, నెల్లూరు తరహాలో స్ట్రీట్ బజార్ పెట్టి తక్కువ కిరాయికి రూములు అందించే ఆలోచన ఉన్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా పట్టణంలో ఆటోనగర్ ఏర్పాటుకు కృషి చేస్తానని తెలిపారు. బీపీఎల్‌కు దిగువన ఉన్న అసోసియేషన్ బాధ్యులకు ఇళ్ల స్థలాలు ఇవ్వడానికి కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ ఎస్సై శివనాగరాజు, అసోసియేషన్ అధ్యక్షుడు షేక్ సలాం, శ్రీనివాస్, రియాజ్, శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.

ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ అభినందనలు

కందుకూరు నియోజకవర్గాన్ని తిరిగి ప్రకాశం జిల్లాలో కలపడంలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు కృషి ఎంతో ఉందని ఏపీ రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్ కందుకూరు డివిజన్ సభ్యులు పేర్కొన్నారు. ఆదివారం పార్టీ కార్యాలయంలో వారు ఎమ్మెల్యేకు పుష్పగుచ్ఛం అందచేసి అభినందనలు తెలిపారు. గత వైసీపీ ప్రభుత్వం నియోజకవర్గ ప్రజల మనోభావాలను పరిగణలోకి తీసుకోకుండా ఏకపక్షంగా నెల్లూరు జిల్లాలో కలపడం వలన ప్రజలతోపాటు, ఉద్యోగులు కూడా అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారన్నారు. ప్రస్తుత సీఎం చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం తిరిగి ప్రకాశంలో కలుపుతున్నందుకు ప్రభుత్వానికి రెవెన్యూ ఉద్యోగస్తుల తరపున ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు ఎస్ విజయభాస్కర్, అసోసియేషన్ ప్రెసిడెంట్ మధుసూదన్‌రావు, ట్రెజరర్ రమణయ్య, కార్యవర్గ సభ్యులు సాయితేజ, శ్రీకాంత్, సింగయ్య పాల్గొన్నారు.


మొబైల్ టెక్నీషియన్ అసోసియేషన్ లోగోను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి

రక్షణ కల్పించండి!

● డీఎస్పీని ఆశ్రయించిన ప్రేమజంట


ప్రేమజంటతో మాట్లాడుతున్న డీఎస్పీ శ్రీధర్

కావలి రూరల్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ప్రేమ వివాహం చేసుకున్న ఓ జంట తమకు కుటుంబ సభ్యుల నుండి రక్షణ కల్పించాలని ఆదివారం కావలి డీఎస్పీ శ్రీధర్‌ను ఆశ్రయించింది. జలదంకి మండలం లింగరాజు అగ్రహారానికి చెందిన అన్నం కార్తీక్, ప్రకాశం జిల్లా కొత్తపట్నం మండలం మన్నూరుకు చెందిన సూరగం ప్రసన్న ప్రేమించుకున్నారు. అయితే ఇరు కుటుంబాల పెద్దలు ఒప్పుకోరని ఇంటి నుండి వచ్చేశారు. ఇద్దరూ మేజర్లు కావటంతో ఈ నెల 26వ తేదీన కావలి చెరువు వద్ద ఉన్న మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. అనంతరం ఈ విషయాన్ని కార్తీక్ కుటుంబ సభ్యులకు తెలపటంతో వారు అంగీకరించారు. దీంతో వారు లింగరాజు అగ్రహారంలో ఉంటున్నారు. ఇదిలా ఉండగా ప్రసన్న కనిపించటం లేదని కుటుంబ సభ్యులు కొత్తపట్నం పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ప్రసన్న, లింగరాజు అగ్రహారంలో ఉన్నట్లు పోలీసులు గుర్తించారు. శనివారం కుటుంబసభ్యులు పోలీసులను వెంటబెట్టుకుని అక్కడికి వెళ్లి ప్రసన్నతో మాట్లాడారు. అయితే తాను ఇష్టపడే కార్తీక్‌ను వివాహం చేసుకున్నానని చెప్పిన ప్రసన్న తన కుటుంబసభ్యులతో ఇంటికి వెళ్లడానికి నిరాకరించింది. దీంతో పోలీసులు అక్కడినుంచి వెళ్లిపోయారు. అనంతరం కార్తీక్ కుటుంబ సభ్యులతో కలిసి నూతన దంపతులు డీఎస్పీని కలిసి రక్షణ కోరారు. ఇద్దరూ మేజర్లు కావటంతో ప్రసన్న కుటుంబ సభ్యులను పిలిపించి, ఇరు కుటుంబాలతో మాట్లాడి రక్షణ కల్పిస్తామని డీఎస్పీ తెలిపారు.

పెంచలయ్య హత్యకు నిరసనగా కొవ్వొత్తులతో ర్యాలీ


కొవ్వొత్తులతో నిరసన తెలుపుతున్న నాయకులు

కావలి (టౌన్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సీపీఎం నాయకుడు పెంచలయ్య హత్యకు నిరసనగా ఆదివారం ట్రంకు రోడ్డులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్ర మం నిర్వహించారు. పార్టీ పట్టణ కార్యదర్శి పసుపులేటి పెంచలయ్య మాట్లాడుతూ గంజాయి, మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా నెల్లూరు నగరంలో పెంచలయ్య పోరాటం చేస్తూ యువతను చైతన్యపరుస్తున్నారని, అది సహించలేని గంజాయి బ్యాచ్ పెంచ లయ్యను పథకం ప్రకారం హత్య చేయడం అమానుషమన్నారు. హంతకులను కఠినంగా శిక్షించేవరకు పోరాటం చేస్తామన్నారు. డిసెంబరు 2న జిల్లా బంద్‌ను జయప్రదం చేయాలన్నారు. కార్యక్రమంలో నేతలు తిరుపాలు, బి కృష్ణయ్య, మేడ వెంకటేశ్వర్లు, చెన్నయ్య, కె నారాయణ, అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

కామేశ్వరరావుకు ఘన నివాళి

కావలి (టౌన్) నవంబరు 30(ఆంధ్రజ్యోతి): కామేశ్వరరావు బలిదానంతోనే విద్యుత్ కార్మికుల జీవితాల్లో వెలుగులు వచ్చాయని విద్యుత్ శాఖ ఈఈ బెనర్జీ పేర్కొన్నారు. ఆదివారం కామేశ్వరరావు 52వ వర్ధంతి పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎలక్ట్రిసిటీ ఎంప్లాయీస్ యూనియన్ ఆధ్వర్యంలో జరిగిన వర్ధంతి సభకు ఆయన హాజరై కామేశ్వరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. యూనియన్ నాయకులు ఎస్‌కె సందాని బాష, లక్ష్మీరెడ్డి మాట్లాడుతూ వేలాదిమంది ఉద్యోగులకు కామేశ్వరరావు భద్రత, భరోసా కల్పించారన్నారు. కార్యక్రమంలో ఏఈలు నాగార్జున, వసంతరావు, సామాజిక కార్యకర్తలు నారపరెడ్డి, వేణుగోపాల్ రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

కుటుంబ కలహాలతో వ్యక్తి ఆత్మహత్య

ఉలవపాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కుటుంబ కలహాలతో ఉరివేసుకుని వ్యక్తి ఆత్మహత్య చేసుకున్న సంఘటన ఆదివారం ఉలవపాడులో జరిగింది. ఎస్సై అంకమ్మ తెలిపిన వివరాల మేరకు.. ఉలవపాడు గ్రామానికి చెందిన ఓగుబోయిన ప్రసాదు మన్నేటికోట అడ్డరోడ్డు వద్ద రొయ్యల చెరువులు సాగు చేస్తున్నాడు. వేటపాలెం మండలం జగన్నాధపురం గ్రామానికి చెందిన రాపూరి సాంబశివరావు (50) రొయ్యల చెరువుల వద్ద పనిచేయడానికి కుదిరాడు. సుమారు 17 ఏళ్లుగా తన భార్యతో దూరంగా ఉంటూ మరో మహిళలతో అక్రమ సంబంధం పెట్టుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈనేపథ్యంలో కుటుంబ సభ్యులు, కుమారుడు ఇటీవల సాంబశివరావుతో గొడవలు పెట్టుకున్నారు. దీంతో మనస్తాపం చెంది, తను పనిచేస్తున్న రొయ్యల చెరువు వద్ద నివాసం ఉంటున్న రేకుల షెడ్డులోని ఇనుప కమ్మీకు ఉరివేసుని ఆత్మహత్య చేసుకున్నాడు. విషయం తెలుసుకున్న కందుకూరు సీఐ అన్వర్‌బాషా సంఘటనా స్థలంకు చేరుకొని ఎస్సై అంకమ్మతో కలిసి అక్కడ పనిచేస్తున్న వ్యక్తులను విచారించారు. మృతుడి భార్య రాపూరి కోటేశ్వరమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉలవపాడు సీహెచ్‌సీకి తరలించినట్లు పోలీసులు తెలిపారు.


దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి


సోమశిల జలాశయాన్ని సందర్శించిన తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డి

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అనంతసాగరం తహసీల్దారు జయవర్ధన్‌రెడ్డి తెలిపారు. ఆయన ఆదివారం సోమశిల జలాశయాన్ని సందర్శించి నీటి వివరాలను సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసేలా రెవెన్యూ ఉద్యోగులకు సూచనలు చేశారు. ఆయన వెంట ఆర్ఐ రవి ఉన్నారు.

●**చేజర్ల:** తుపాను పట్ల మండలంలోని ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్ఐ తిరుమలరావు సూచించారు. రెండు రోజుల పాటు భారీ వర్షాలు కురుస్తాయని, అధికారుల ఆదేశాల మేర కు పెన్నానది పరీవాహక గ్రామాలలోని ప్రజలు నదివైపు వెళ్ళరాదని సూచించారు. అత్యవసరమైతే తప్ప ప్రజలు ఇళ్ల నుండి బయటకు రావద్దని, ముఖ్యంగా వాగులు, చప్టాలు, నీరు ప్రవహిస్తున్న ప్రదేశాలు దాటే ప్రయత్నాలు చేయవద్దని తెలిపారు. ఏదైనా అత్యవసర పరిస్థితులు ఎదురైతే డయల్ 112, లేదా పోలీస్‌స్టేషన్‌కు ఫోన్ చేయాలని కోరారు.

హంతకులను కఠినంగా శిక్షించాలి : సీపీఎం


ఆందోళన చేస్తున్న సీపీఎం నాయకులు

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నెల్లూరులో సీపీఎం సభ్యుడు పెంచలయ్యను హత్యచేసిన వారిని కఠినంగా శిక్షించాలని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆదివారం సీపీఎం నాయకులు ఆందోళన చేశారు. గంజాయి, మాదకద్రవ్యాల ముఠా అతన్ని హతమార్చినట్లు ఆరోపించారు. వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని నినాదాలు చేశారు. కార్యక్రమంలో నాయకులు అన్వర్‌బాషా, సుబ్బారాయుడు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం


పాఠశాలలో సమావేశమైన పూర్వ విదార్థులు

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రేవూరు ఉన్నత పాఠశాలలో 1992-93 పదవ తరగతి బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆదివారం పాఠశాలలో కలిశారు. ఈసందర్భంగా అప్పుడు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులు చలమయ్య, దశయ్య, షంషుద్దీన్‌లను సన్మానించారు.

వర్షాలతో వీధులు బురదమయం

● అవస్థలు పడుతున్న జనం


వీవర్స్ కాలనీలో బురదమయమై అధ్వానంగా ఉన్న రోడ్డు

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో కురుస్తున్న వర్షాలకు ఆత్మకూరు మున్సిపాల్టీ పరిధిలోని పలు వీధులు, లోతట్టు ప్రాంతాలు, వీవర్స్ కాలనీలో రోడ్లు బురదమయమై అధ్వానంగా తయారవడంతో ఆ ప్రాంతవాసులు ఇబ్బందులు పడుతున్నారు. వీవర్స్ కాలనీలో రోడ్లు, మురుగు కాలువలు సక్రమంగా లేకపోవడంతో చిన్నపాటి వర్షానికైనా ఇబ్బందులు తప్పడం లేదని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కాగా, తుఫాన్ నేపథ్యంలో గత రెండు రోజులుగా వర్షం కురుస్తుండడంతో అధికార యంత్రాంగం అప్రమత్తమయ్యారు. వాగులు, వంకల వద్ద ప్రత్యేక బృందాలను ఏర్పాటుచేసి పర్యవేక్షిస్తున్నారు. ఆర్డీవో బి పావని అధికార యంత్రాంగం అప్రమత్తంగా ఉండి ప్రజలు ఇబ్బందులు పడకుండా తక్షణ చర్యలు చేపట్టాలని ఆదేశించారు. దిత్వా తుఫాన్ ప్రభావం తీవ్రంగా ఉండనుండడంతో ఆత్మకూరు పట్టణ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. తుఫాన్ సహాయక చర్యలు నిమిత్తం ఆత్మకూరు మున్సిపల్ కార్యాలయంలో అత్యవసర కాల్ సెంటర్ ఏర్పాటు చేశామన్నారు. ఎటువంటి విపత్కర పరిస్థితులు ఎదురైనా 0827- 220385 నెంబర్‌కు ఫోన్ చేయాలని కోరారు.

●**సంగం:** మండలంలో దిత్వా తుఫాన్ ప్రభావంతో శనివారం రాత్రి నుంచి ఆదివారం సాయంత్రం వరకు ఎడతెరిపి లేకుండా వర్షం కురిసింది. దీంతో వీధులన్నీ జలమయమయ్యాయి. జనజీవనం స్తంభించింది.

●**ఉదయగిరి:** దిత్వా తుఫాన్ ప్రభావంతో మెట్ట ప్రాంతమైన ఉదయగిరిలో శనివారం రాత్రి నుంచి చిరుజల్లులు కురుస్తున్నాయి. వర్షానికి వీధులు, బస్టాండ్ ప్రాంతం బురదమయంగా మారింది. భారీ వర్షాలు కురిస్తే నీటివనరులకు ప్రమాదం పొంచి ఉందని రైతులు అభిప్రాయపడుతున్నారు.

గంగమ్మకు ప్రత్యేక పూజలు


ప్రత్యేక అలంకరణలో గంగమ్మతల్లి

ఉదయగిరి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మండలంలోని గండిపాళెం జలాశయం ఆవరణలో ఉన్న గంగమ్మతల్లి ఆలయంలో ఆదివారం మార్గశిర మాసం దశమి తిథి కావడంతో అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు చేశారు. ఈసందర్భంగా భక్తులు అమ్మవారికి కాయా కర్పూరం అందజేసి ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఘనంగా గంధ మహోత్సవం


చేజర్ల, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన చేజర్లలోని హజరత్ ఖాదర్‌వలియా గంధ మహోత్సవాన్ని ఆదివారం ముస్లింలు ఘనంగా నిర్వహించారు. మేళతాళాలు, ఫకీరుల వాయిద్యాలతో ఊరేగింపుగా ఫాతిహా సామాగ్రిని దర్గా వద్దకు తీసుకువచ్చి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. అనంతరం భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. గంధ మహోత్సవం సందర్భంగా నజీర్ బ్రదర్స్, వంగవరపు అనంద్ రెడ్డి ఆధ్వర్యంలో భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. చేజర్ల ఎస్ఐ తిరుమలరావు, పలు గ్రామాల నాయకులు దర్గాలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కాంగ్రెస్ పార్టీ పటిష్టతకు కృషిచేయాలి : చేవూరు


సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్‌పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి

ఆత్మకూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవం రాబోతుందని, నేతలు, కార్యకర్తలు సమన్వయంతో పార్టీ పటిష్టతకు కృషిచేయాలని పార్టీ జిల్లా అధ్యక్షుడు చేవూరు దేవకుమార్‌రెడ్డి సూచించారు. స్థానిక శ్రీధర్ గార్డెన్స్‌లో దేశవ్యాప్తంగా పార్టీ సంస్థగత నిర్మాణం (సంఘటన్ సృజనా అభియాన్) కార్యక్రమంలో భాగంగా నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ఏఐసీసీ పరిశీలకులు, తమిళనాడు ఎమ్మెల్యే అసన్ మౌలానా, ఏపీసీసీ స్పోర్ట్స్ సెల్ చైర్మన్, సమన్వయకర్త జీవీవీఎస్ కమలాకర్‌రావు, సీనియర్ నాయకులు ఎం బుల్లిబాబు పాల్గొని ప్రసంగించారు. ప్రజల సమస్యలపై పోరాడాలని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రెసిడెంట్ వన్నం నాగరాజు, నియోజకవర్గంలోని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు షేక్ ఖాజారంతుల్లా, పీర్ల శికుమార్, కొల్లూరు ప్రసాద్, కాకి తిరిపాలు, మద్దాల మల్లికార్జునరెడ్డి, షేక్ ఖాదర్‌నిషా, పి దివ్యజ్యోతి, పలువురు నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భగవద్గీత జాతికి ఆదర్శం


శాకాహార ర్యాలీ నిర్వహిస్తున్న ధ్యానులు

వింజమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): భగవద్గీత భరత జాతికి, యావత్ ప్రపంచానికి ఆదర్శనీయమని, దీనిని అర్థం చేసుకుని ఆచరించినట్లయితే మానవ జన్మ ధన్యమవుతుందని సీనియర్ పిరమిడ్ మాస్టర్ విజయలక్ష్మీ అన్నారు. వింజమూరులోని వేదవ్యాస వశిష్ట పిరమిడ్ ధ్యాన మహాశక్తి క్షేత్రంలో ఆదివారం ఆత్మజ్ఞానం కార్యక్రమంలో ఆమె పాల్గొని భగవద్గీత శ్లోకాలు, వాటి అర్థాలు, అంతరార్థాలను వివరించారు. ధ్యానంపై అవగాహన కల్పించారు. శాకాహారం ప్రాముఖ్యతపై కరపత్రాలు పంచుతూ ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ధ్యానులు తదితరులు పాల్గొన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి : యూటీఎఫ్

వింజమూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతి శర్మ డిమాండ్ చేశారు. పట్టణంలోని జడ్పీ బాలుర హైస్కూల్‌లో ఆదివారం యూటీఎఫ్ మండల శాఖ ఆధ్వర్యంలో నూతన కౌన్సిల్ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా ప్రధాన కార్యదర్శి జీవి చలపతి శర్మ పాల్గొని మాట్లాడుతూ ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి విముక్తి కలిగించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. ఈ సమావేశంలో నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. జిల్లా నాయకులు బాలరాఘవులు, చంచలబాబు, సీనియర్ నాయకులు కామాక్షయ్య, పెద్దవంగయ్య, చిన్నవెంకయ్య, మండల నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

గురజాడకు ఘన నివాళి


గురజాడ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న విద్యార్థులు

అనంతసాగరం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆదివారం ప్రముఖ కవి గురజాడ అప్పారావు వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా గ్రంథపాలకుడు నారాయణరావు గురజాడ చేసిన సేవలను విద్యార్థులకు వివరించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో కేడీపల్లి పుస్తక కేంద్రం నిర్వాహకుడు భానుప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

కోన కాలువ నీటితొట్టె శుభ్రం


తొట్టెను శుభ్రం చేస్తున్న పంచాయతీ సిబ్బంది

ఉదయగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి పట్టణ ప్రజల దాహర్తి తీర్చే కోనకాలువ నీటితొట్టెను పంచాయతీ సర్పంచ్ సామ్రాజ్యం, ఉప సర్పంచ్ ముర్తుజాల ఆదేశాల మేరకు ఆదివారం పంచాయతీ ఈవో కరీముల్లా సిబ్బందిచే శుభ్రం చేయించారు. వర్షాలు కురుస్తున్నందున తాగునీటికి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తుగా తొట్టిని శుభ్రం చేసి నీరు సజావుగా సరఫరా అయ్యేలా చేశారు.

నేడు గాంధీజన సంఘంలో మంత్రి ఆనం పర్యటన

సంగం, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గాంధీజన సంఘం గ్రామ పంచాయతీలో సోమవారం ఎన్టీఆర్ భరోసా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో దేవదాయ ధర్మాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణరెడ్డి పాల్గొంటారని మండల పార్టీ అధ్యక్షుడు బాణా శ్రీనివాసులురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. పింఛన్ల పంపిణీ కార్యక్రమం అనంతరం గ్రామంలో రూ. 32 లక్షలతో నిర్మాణం చేపట్టనున్న పంచాయతీ భవనానికి, రూ. 5 లక్షలతో రామాలయం ప్రహరీ, రూ. 14 లక్షలతో చేపట్టే సీసీ రోడ్డు పనులకు ఆయన భూమి పూజ చేస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ నాయకులు, అధికారులు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

నేటి నుంచి వీపీఆర్ నేత్ర శిబిరం

ఉదయగిరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలో సోమవారం నుంచి శనివారం వరకు నెల్లూరు పార్లమెంట్ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నేత్ర శిబిరం నిర్వహించనున్నట్లు మండల టీడీపీ కన్వీనర్ చింతనబోయిన బయ్యన్న ఆదివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. సోమవారం గండిపాళెం, మంగళవారం వెంగళరావునగర్, బుధవారం తిరుమలాపురం, గురువారం అప్పసముద్రం, శుక్రవారం దాసరిపల్లి, శనివారం ఉదయగిరి పంచాయతీల్లో ఈ శిబిరాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కంటి సమస్యలతో బాధపడుతున్న వారు శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.



వాన ముసురు అందాలు



దిత్వా తుఫాన్ ప్రభావం తిరుమల క్షేత్రంలో భక్తులను వణికిస్తోంది. ఎడతెరిపి లేకుండా వాన కురుస్తూనే ఉంది. ఎటు చూసినా గొడుగులు కనిపిస్తున్నాయి. అనేకమంది నెత్తి తడవకుండా గుడ్డలు కప్పుకొని తిరుగుతున్నారు. చలికి షెడ్ల కింద ముడుక్కుని ఉంటున్నారు. దీంతో దుకాణాలు వెలవెలపోతున్నాయి. మరోవైపున ఘాట్‌రోడ్లు సహా తిరుమల అంతా పొగమంచు కప్పేసింది. మంచు మబ్బుతెరల వెనుక దృశ్యాలు మసకబారి కనిపిస్తూ సరికొత్త అందాలను పంచుతున్నాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తీవ్ర వాయుగుండంగా దిత్వా

- నేడు భారీ వర్ష సూచన
- తీర ప్రాంతాల్లో అధిక ప్రభావం
- అప్రమత్తమైన యంత్రాంగం
- విద్యా సంస్థలకు సెలవు
- బీచ్‌లు, జలపాతాలు, నదులవైపు రాకపోకల నిషేధం
- పీజీఆర్ఎస్ రద్దు



కోట మండలం యమదిన్నెపాళెం వద్ద అలల ఉధృతి



కోట మండలం శ్రీనివాససత్రం బీచ్‌లోకి సందర్శకులు వెళ్లకుండా గేటు వేసిన మెరైన్ పోలీసులు

తిరుపతి(కలెక్టరేట్)/సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గత ఆరు గంటల్లో ఉత్తర తమిళనాడు- పుదుచ్చేరి తీర ప్రాంతాల్లో 5 కిలోమీటర్ల వేగంతో ఉత్తరం వైపు కదిలిన దిత్వా.. తీవ్ర వాయుగుండంగా బలహీనపడింది. ఆదివారం సాయంత్రానికి కడలూరుకు తూర్పున 90 కిలోమీటర్లు, కరైకల్‌కు ఈశాన్యంగా 130, పుదుచ్చేరికి తూర్పు ఆగ్నేయంగా 90, వేదరన్నియంకి ఈశాన్యంగా 180, చెన్నైకి దక్షిణ-ఆగ్నేయంగా 140 కిలోమీటర్ల దూరంలో ఉంది. ఇది ఉత్తర తమిళనాడు- పుదుచ్చేరి తీరాలకు సమాంతరంగా ఉత్తరం వైపు కదిలి.. సోమవారం ఉదయానికి క్రమంగా బలహీనపడి వాయుగుండంగా మారే అవకాశం ఉంది. దీని ప్రభావంతో సోమవారం భారీ వర్షంతోపాటు 50 కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులు వీస్తాయని వాతావరణ శాఖ హెచ్చరికలు జారీ చేసింది. ప్రధానంగా కోట, వాకాడు, చిల్లకూరు, తడ, సూళ్లూరుపేట, గూడూరు తీర ప్రాంతాల్లో దీని ప్రభావం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. దీంతో జిల్లా యంత్రాంగం అప్రమత్తమైంది. ముందస్తు చర్యలపై కలెక్టర్ వెంకటేశ్వర్ అధికారులతో సమీక్షించారు. తీర ప్రాంతాలతో పాటు జిల్లాలోని లోతట్టు ప్రాంతాలపై దృష్టి సారించారు. అవసరాన్ని బట్టి పునరావాస కేంద్రాలకు నిరాశ్రయులను తరలించేలా ప్రణాళికలు రూపొందించారు. తహసీల్దారు కార్యాలయాల్లో కంట్రోల్ రూమ్‌లు ఏర్పాటుచేశారు. కలెక్టరేట్‌లో కమాండ్ కంట్రోల్ రూమ్ 0877-2236007 నెంబర్‌ను ఏర్పాటు చేశారు. ఉద్యోగులు, అధికారుల సెలవులు రద్దుచేసి విధుల్లో చేరి 24 గంటలు అందుబాటులో ఉండాలను కలెక్టర్ ఆదేశించారు. ముందుజాగ్రత్త చర్యగా సోమవారం విద్యాసంస్థలకు సెలవు ప్రకటించారు. అలాగే, కలెక్టరేట్‌తో పాటు డివిజన్, మండలస్థాయిల్లో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమాన్ని రద్దు చేశారు. ఇక, కోట, వాకాడు, చిల్లకూరు వద్ద సముద్ర అలలు ఎగసి పడుతున్నాయి. సూళ్లూరుపేటలో పులికాట్ సరస్సు సముద్రాన్ని తలపించేలా నీటి అలలు ఉధృతంగా ఉన్నాయి. జిల్లాలోని జలపాతాలు, నదులు, బీచ్‌ల వద్దకు సందర్శకులు వెళ్లకుండా ఆంక్షలు విధించారు. వాగులు, చెరువులను అధికారులు ఆదివారం పరిశీలించారు.

వర్షపాతం ఇలా..

ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం 6 గంటల వరకు నమోదైన వర్షపాతం.. వెంకటగిరిలో 25.2 మి.మీ., చిట్టమూరు 25, పెళ్లకూరు 23.6, తొట్టంబేడు 22.4, దొరవారిసత్రం 20.6, వాకాడు 20 మి.మీ. చొప్పున నమోదైంది. దాదాపు 17 మండలాల్లో వర్షపాతమే నమోదు కాలేదు.

'అల'కల్లోలం

కోట, ఆంధ్రజ్యోతి: కోట మండలంలోని శ్రీనివాసత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల్లో సముద్రం 'అల'కల్లోలంగా మారింది. శ్రీనివాసత్రం వద్ద భారీ అలలతో 30 అడుగుల ముందుకు సముద్రం వచ్చినట్లు మెరైన్, కోట పోలీసులు తెలిపారు. రెండో రోజూ మత్స్యకారులు సముద్రంలోకి చేపలవేటకు వెళ్లకుండా తమ బోట్లను ఒడ్డునే ఉంచారు. అలలు ముందుకు వచ్చితాకడంతో బోట్లు ఎక్కడ సముద్రంలోకి కొట్టుకుపోతాయోనని మత్స్యకారులు ఆందోళన చెందారు. శ్రీనివాసత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం వద్ద సముద్ర తీరానికి సందర్శకులు వెళ్లకుండా మెరైన్ పోలీసులు ఆంక్షలు విధించారు.

విమానాలు ఆలస్యం

రేణిగుంట, ఆంధ్రజ్యోతి: తుఫాను కారణంగా ఆదివారం పలు విమానాలు ఆలస్యంగా వచ్చాయి. రేణిగుంట విమానాశ్రయానికి నిత్యం 16 విమాన సర్వీసులు నడుస్తున్నాయి. ఆదివారం ఉదయం 7.15కు హైదరాబాద్ నుంచి రావాల్సిన ఎయిర్ అలయన్స్ విమానం 8.25కు చేరుకుంది. మధ్యాహ్నం 12.35కు రావాల్సిన ఇండిగో ఎయిర్ బస్ 25 నిమిషాలు.. సాయంత్రం 5.20కు ముంబై నుంచి రావాల్సిన ఇండిగో విమానం 6.20కి.. అలాగే పలు విమానాలు 10 నుంచి 15 నిమిషాలు ఆలస్యంగా చేరుకున్నాయి.

బీ అలర్ట్

తుఫాను నేపథ్యంలో ఎస్పీ సుడిగాలి పర్యటన



అరణియార్ ప్రాజెక్టు వద్ద ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి: తుఫాను నేపథ్యంలో ఎక్కడెక్కడ నదులు, వాగులు, చెరువులు, కాలువలు, డ్యామ్‌లు నిండి ఉధృతంగా ప్రవహించే అవకాశాలు ఉన్నాయనేది అధ్యయనం చేయడానికి ఎస్పీ సుబ్బరాయుడు ఆదివారం సంబంధిత డీఎస్పీలతో కలిసి పర్యటించారు. పిచ్చాటూరులోని అరణియార్ ప్రాజెక్టును డీఎస్పీ రవికుమార్‌తో కలిసి పరిశీలించారు. ఇప్పటికే ప్రాజెక్టు నిండిందని, మళ్లీ వర్షం కురిస్తే గేట్లు ఎత్తడం వల్ల గ్రామాలు ముంపునకు గురయ్యే అవకాశం ఉందా అని తెలుసుకున్నారు. దీనిపై ముందుగానే ఆయా గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాలని ఆదేశించారు. ఇప్పటికే అరణియార్ నుంచి 400 క్యూసెక్కుల నీటిని విడుదల చేసినట్లు ఈఈ తెలిపారు. ప్రతి ప్రాజెక్టు వద్ద రెస్క్యూ టీమ్‌లను సిద్ధంగా ఉంచారు. గతంలో తిరుపతి రూరల్ మండల పరిధిలోని స్వర్ణముఖినదిలో సరదాగా ఈతకని వెళ్లి నలుగురు యువకులు చనిపోయిన విషయం తెలిసిందే. దీంతో వాగులు, నదుల్లోకి వెళ్లకుండా చర్యలు చేపట్టాలని పోలీసులను ఆదేశించారు. బాగా తెలిసిన దారే కదా అని కదా ప్రవాహం వున్న ప్రదేశాల్లో వాహనాలు నడపడం.. దాటే ప్రయత్నం చేయొద్దని సూచించారు. అత్యవసర పరిస్థితుల్లో పోలీసు కంట్రోలు రూము నెంబరు 80999 99977, ఎమర్జెన్సీ నెంబరు 112 నెంబర్లకు ఫోన్ చేసి సమాచారం ఇవ్వాలని ఎస్పీ విజ్ఞప్తి చేశారు.

జిల్లాలో మూడు రెస్క్యూ టీమ్‌లు : తిరుపతిలో మూడు రెస్క్యూ టీమ్‌లను ఎస్పీ సుబ్బరాయుడు సిద్ధం చేశారు. వీరితో పాటు ప్రతి సబ్ డివిజన్ పరిధిలో ఒక టీమ్ అందుబాటులో ఉంది. వీరికి అవసరమైన లైటింగ్ సామగ్రి, లైఫ్ జాకెట్లు, టార్చ్ లైట్లు, తాళ్ళు తదితర రక్షణ పరికరాలు అందించారు. నీట మునిగే అవకాశం ఉన్న రహదారుల వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ చెప్పారు.

డిస్కం ఉద్యోగులూ.. సిద్ధంగా ఉండండి

తిరుపతి(ఆటోనగర్), ఆంధ్రజ్యోతి: 'దిత్వా తుఫాన్ ప్రభావంతో వీచే గాలులకు విద్యుత్ వైర్లు తెగొచ్చు. స్తంభాలు కూలిపోవచ్చు. తద్వారా సరఫరాలో అంతరాయం కలగొచ్చు. వెంటనే వీటన్నింటినీ సరిచేసి సరఫరా పునరుద్ధరించేందుకు సిద్ధంగా ఉండండి' అంటూ సదరన్ డిస్కం సీఎండీ శివశంకర్ అధికారులను ఆదేశించారు. ఎక్కడైనా ఇబ్బంది తలెత్తితే టోల్ ఫ్రీ నెంబరు 1912, లేదా 1800 425 155333కి కాల్ చేసి సమాచారం ఇవ్వాలని వినియోగదారులకు ఆయన విజ్ఞప్తి చేశారు.

జలకళలాడుతున్న తిరుమల డ్యామ్‌లు



పాపవినాశనం డ్యామ్

తిరుమల, నవంబరు30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను వానలతో తిరుమలలోని జలాశయాలు పొంగి పొర్లుతున్నాయి. అక్టోబరులో కురిసిన వర్షాలకే తిరుమలలోని పాపవినాశనం, గోగర్భం, ఆకాశగంగ, కుమారధార, పసుపుధార డ్యాములు 98 శాతం నిండిపోయాయి. పాపవినాశనం, గోగర్భం డ్యాముల గేట్లను కూడా అప్పుడు ఎత్తాల్సివచ్చింది. నిజానికి ఇప్పుడు భారీ వర్షాలు కురవకపోయినా, నవంబరు నెల ప్రారంభంలో కురిసిన వర్షాలకు శేషాచల అడవుల నుంచి ఊటనీరు భారీగా డ్యాముల్లోకి చేరుతూ వచ్చింది. నవంబరు24వ తేదీకే డ్యాములన్నీ నిండిపోయి, గోగర్భం, పాపవినాశనం డ్యాముల గేట్లు ఒక అంగుళం మేర తెరిచి దిగువకు వదులుతున్నారు. రెండురోజుల నుంచి కురుస్తున్న వానలతో డ్యాములు నిండుకుండల్లా కనిపిస్తున్నాయి. ముందుజాగ్రత్తగా ఆదివారం మధ్యాహ్నం గోగర్భం, పాపవినాశనం గేట్లు మరొక అంగుళం పైకెత్తారు. ప్రస్తుతం పాపవినాశనంలో 5,240 లక్షల గ్యాలన్లు, గోగర్భంలో 2,833 లక్షల గ్యాలన్లు, ఆకాశగంగలో 685 లక్షల గ్యాలన్లు, కుమారధారలో 4,258.98 లక్షల గ్యాలన్లు, పసుపుధార డ్యాములో 1,287.51 లక్షల గ్యాలన్ల నీరు ఉంది. దాదాపు తొమ్మిది నెలల పాటు తిరుమల నీటి అవసరాలు తీర్చేంత నీరు ప్రస్తుతం డ్యాముల్లో ఉంది.

నేడు డయల్ యువర్ డిస్కం సీఎండీ

తిరుపతి(ఆటోనగర్), నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): తిరుపతిలోని సదరన్ డిస్కం కేంద్ర కార్యాలయంలో సోమవారం డయల్ యువర్ ఏపీఎస్పీడీసీఎల్ సీఎండీ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు సీఎండీ శివశంకర్ ఆదివారం తెలిపారు. ఉదయం 10 నుంచి 12 గంటల వరకు వినియోగదారులు 89777 16661 నెంబరుకు ఫోనుచేసి సమస్యలు చెబితే పరిష్కారానికి చర్యలు తీసుకుంటామన్నారు. 91333 31912 నెంబరుకూ చాట్‌చేసి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లచ్చన్నారు.

పోలీసు పీజీఆర్ఎస్ రద్దు

తిరుపతి(నేరవిభాగం), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాను నేపథ్యంలో సోమవారం ఎస్పీ కార్యాలయంలో నిర్వహించే పోలీసు పీజీఆర్ఎస్ రద్దు చేసినట్లు సుబ్బరాయుడు తెలిపారు. ఎవరూ ఎస్పీ కార్యాలయానికి రావద్దని, అత్యవసర పరిస్థితుల్లో సమీప పోలీసు స్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాలని సూచించారు.

శ్రీవారి డాలర్లు 'నో స్టాక్'

తిరుమలలో శ్రీవారి బంగారు డాలర్ల కొరత ఏర్పడింది. వారం రోజులుగా డాలర్లు లేకపోయినా అధికారులు పట్టించుకోకపోవడంతో భక్తులు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. కొన్నేళ్లుగా టీటీడీ బంగారు, వెండి, రాగి డాలర్లను విక్రయిస్తోంది. శ్రీవారి సన్నిధిలో స్వామి, అమ్మవార్లు ఉండే బంగారు, వెండి, రాగి డాలర్లను కొనుగోలు చేస్తే మంచి జరుగుతుందని భక్తుల నమ్మకం. ప్రతి నెలా రూ.15 లక్షల నుంచి రూ.20 లక్షల విక్రయాలు జరుగుతుంటాయి. వారం రోజుల కిందట 2 గ్రాములు, 5 గ్రాములు, 10 గ్రాముల బంగారు డాలర్ల కొరత ఏర్పడింది. సాధారణంగా స్టాక్ పూర్తయ్యేలోపే డాలర్లను కౌంటర్లకు తీసుకొచ్చి భక్తులకు అందుబాటులో ఉంచాలి. వారం కిందటే బంగారు డాలర్లు ఖాళీ అయినా, తెప్పించలేదు. ఎంతో భక్తిశ్రద్ధలతో భక్తులు 'డాలర్ల విక్రయ కేంద్రం' వద్దకు వెళితే 'నోస్టాక్' బోర్డు కనిపిస్తోంది. స్టాక్ ఎప్పుడు వస్తుందో కూడా చెప్పలేని పరిస్థితిలో సిబ్బంది ఉన్నారు. మరోవైపు రాగి డాలర్ల విక్రయాలు దాదాపు ఏడాదిగా నిలిచిపోయాయి.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



శ్రీవారి బంగారు డాలర్లు(ఫైల్)

హైదరాబాదుకు సైకిల్ యాత్ర



సైకిల్‌యాత్ర చేపట్టిన మిస్ యూనివర్స్ ఏపీ చందనా జయరాం

శ్రీకాళహస్తి, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతపై అవగాహన పెంపొందించడమే ధ్యేయంగా ఆదివారం శ్రీకాళహస్తి నుంచి హైదరాబాద్‌కు సైకిల్‌యాత్ర మొదలైంది. మిస్ యూనివర్స్ ఏపీ, ప్రముఖ మోడల్ చందన జయరామ్ ఈ సైకిల్ యాత్ర చేపట్టారు. అంతకుముందు పట్టణంలోని ఓ కల్యాణ మండపంలో ఉమెన్ ఎంపవర్‌మెంట్‌పై అవగాహన కల్పించారు. మహిళలు మరింత శక్తిమంతంగా ఎదగాలని చందన జయరామ్ పిలుపునిచ్చారు. అనంతరం 600 కిలోమీటర్ల సైకిల్‌యాత్రను ప్రారంభించారు.

మీ ఖాతాలో డబ్బు పోయిందా?

- తక్షణం 1930కి ఫోన్ చేయండి
- లేకుంటే మీ డబ్బు వెనక్కి రానట్లే

సాంకేతికత పెరుగుతున్న కొద్దీ వివిధ రకాల సైబర్ మోసాలు అధికమవుతున్నాయి. ప్రధానంగా బ్యాంకు ఖాతాల నవీకరణ, ఉద్యోగం పొందారని.. పొందుతున్నారంటూ, వివిధ పార్శిళ్లు మీ పేరిట బుక్ అయ్యాయంటూ ఓటీపీ చెప్పాలంటారు. అలా ఓటీపీ చెప్పగానే మీ ఖాతాల నుంచి నగదు ఖాళీ అవుతుంది. ఇక తెలియని మొబైల్ నెంబర్ల నుంచి సెల్‌ఫోన్లకు వస్తున్న కొన్ని మెసేజీలను ఓపెన్ చేసినా.. ఒక్కోసారి అకౌంట్లలోని డబ్బులు గల్లంతవుతున్నాయి. ఇలా కొట్టేసిన నగదును నేరగాళ్లు వెనువెంటనే మ్యూల్ ఖాతాలకు పంపేస్తున్నారు. ఒకసారి మ్యూల్ ఖాతాలకు వెళితే వెనక్కి తెచ్చుకోవడం కష్టం. దీనిని అడ్డుకుని డబ్బు వెనక్కి రావాలంటే.. నగదు డ్రా అయినట్లు మెసేజీ రాగానే బాధితులు తక్షణం 1930కి ఫోన్ చేసి ఫిర్యాదు చేయాలి. ఎంత త్వరగా పోలీసులకు వివరాలు వెల్లడిస్తే అంత త్వరగా పోయిన డబ్బును వెనక్కు రప్పించవచ్చని ఎస్పీ సుబ్బరాయుడు స్పష్టం చేశారు. అలా కొందరికి వచ్చిన సొమ్మును కొంత కాలంగా అందిస్తున్నారు. గత ఆరు నెలల కాలంలో జరిగిన సైబర్ నేరాల్లో 25 శాతం మంది బాధితులకు పోగొట్టుకున్న నగదు వెనక్కి తెప్పించారు. ఇప్పటి వరకు అందిన సమాచారం మేరకు దాదాపు 517 మంది సైబర్ నేరగాళ్ల బారిన పడి లక్షలాది రూపాయలు పోగొట్టుకున్నారు. వీరిలో దాదాపు 120 మంది బాధితులకు మాత్రమే ఊరట లభించింది. బాధితులు అప్రమత్తంగా

- తిరుపతి(నేరవిభాగం), ఆంధ్రజ్యోతి

విపత్తు వేళా.. విధుల్లో ఉండరే!

దామానెల్లూరు సచివాలయంలో కానరాని సిబ్బంది



దామానెల్లూరు సచివాలయంలో ఎంపీడీవో మురళీకృష్ణ, సింగిల్ విండో డైరెక్టర్ విజయరాఘవులు, హెడ్ కానిస్టేబుల్ జార్జ్, ఏఎన్ఎం బేబీ సురేఖ

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుపాను ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, ఉద్యోగులు, అధికారులు సెలవులు రద్దు చేసుకుని విధుల్లో చేరాలని కలెక్టర్ ఆదేశించారు. అయితే మండల పరిధిలోని దామానెల్లూరు సచివాలయం ఆదివారం తెరుచుకోలేదు. సిబ్బంది ఒక్కరు కూడా విధుల్లో లేరు. ఎంపీడీవో మురళీకృష్ణ ఆ గ్రామ పరిశీలనకు వెళ్లగా ఈ విషయం బయటపడింది. విపత్తు సమయంలో సచివాలయ సిబ్బంది జిల్లా అధికారుల ఆదేశాలను బేఖాతరు చేస్తూ విధి నిర్వహణకు డుమ్మా కొట్టడం గమనార్హం. ఎంపీడీవో వెంట సింగిల్ విండో డైరెక్టర్ విజయరాఘవులు, హెడ్ కానిస్టేబుల్ జార్జ్, ఏఎన్ఎం బేబీ సురేఖ ఉన్నారు.

సెల్‌ఫోన్ హ్యాక్ చేసి రూ.12.05 లక్షల తస్కరణ

డక్కిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సెల్‌ఫోన్ హ్యాక్ చేసిన సైబర్ నేరగాళ్లు బ్యాంకు ఖాతాలోని నగదు మాయం చేశారు. పోలీసుల కథనం మేరకు... డక్కిలి మండలం దిగువ లింగసముద్రం గ్రామానికి చెందిన భార్గవ నెల్లూరులోని ఓ బ్యాంకు నుంచి రూ.13,59 లక్షలు రుణం పొందారు. ఈ మొత్తాన్ని ఖాతాలోనే ఉంచారు. భార్గవ సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేసి అతని బ్యాంకు ఖాతా నుంచి చేసి తొమ్మిది దఫాలుగా రూ.12.05 లక్షలు దోచేశారు. ఖాతాలో నగదు మాయమైనట్లు గుర్తించిన బాధితుడు శనివారం రాత్రి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఎస్ఐ శివశంకర్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



అధికారుల సమావేశంలో మాట్లాడుతున్న తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నందున ప్రజలు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ అన్నారు. ఆదివారం తహసీల్దారు కార్యాలయంలో తుఫాన్ ప్రభావంపై అధికారులతో అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. రాబోయే రెండు రోజులు తుఫాన్ ప్రభావంతో సూళ్లూరుపేట డివిజన్‌లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని, అధికారులు గ్రామాల్లో అందుబాటులో ఉండి ఎప్పటికప్పుడు ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. ముఖ్యంగా నదులు, వాగులు, వంకలు ప్రవహించే ప్రాంతాల్లోకి ప్రజలు వెళ్లకూడదన్నారు. పులికాట్‌లో సరస్సులో వేటకు వెళ్లవద్దని మత్స్యకారులకు సూచించారు. సూళ్లూరుపేట పట్టణంలో మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య, అధికారులు, సిబ్బందితో కలిసి పల్లపు ప్రాంతాల్లో పర్యటించి ప్రజలను అప్రమత్తం చేశారు.

అధికారులందరూ అప్రమత్తంగా ఉండాలి

ఓజిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ నేపథ్యంలో వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు అప్రమత్తంగా ఉండాలని మండల ప్రత్యేకాధికారి సురేష్‌బాబు అన్నారు. ఆదివారం ఆయన ఓజిలిలోని మండల పరిషత్ కార్యాలయంలో అధికారులతో అత్యవసర సమావేశం నిర్వహించారు. అన్ని శాఖల అధికారులు వారికి కేటాయించిన గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. సమావేశంలో తహసీల్దారు పద్మావతి, ఎంపీడీవో నారాయణరెడ్డి, పలు శాఖల అధికారులు, వీఆర్వోలు, కార్యదర్శులు ఉన్నారు.

పెళ్లకూరు: వర్షాలు పడుతున్న నేపథ్యంలో మండలంలోని వీఆర్వోలు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయాల ఉద్యోగులు అప్రమత్తంగా ఉండాలని తహసీల్దారు హరికృష్ణ ఆదేశించారు. మరో 24 గంటల వరకు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణశాఖ హెచ్చరికల నేపథ్యంలో తాగునీరు కలుషితం కాకుండా చర్యలు తీసుకోవాలని, మురుగునీటి కాలువల్లో నీరు నిల్వ చేరకుండా చూడాలని సూచించారు. లోతట్టు ప్రాంతాల్లో నివసించే వారిని సురక్షిత ప్రాంతాలకు తరలించే ఏర్పాట్లు చేయాలని ఆయా గ్రామాల ప్రత్యేక అధికారులకు సూచించారు.

ఎడతెరపిలేని ముసురు

పెళ్లకూరు, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): బంగాళఖాతంలో ఏర్పడిన దిత్వా తుఫాన్ ప్రభావంతో మండలంలో శనివారం నుంచి ఎడతెరపి లేకుండా వర్షాలు కురుస్తున్నాయి. ఆదివారం ఉదయం నుంచి సాయత్రం వరకు 23.6 మి.మీ వర్షపాతం నమోదైంది. రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో మండలంలో జనజీవనం స్థంభించింది. గ్రామీణ రహదారులు ఛిద్రమయ్యాయి. వర్షాలతో పంటలు పచ్చదనం పరుచుకుని ఆహ్లాదకర వాతావరణం నెలకొంది.

దొరవారిసత్రం: దిత్వా తుపాన్ ప్రభావంతో దొరవారిసత్రం మండలంలో ఆదివారం ఉదయం నుంచి సాయంత్రం వరకు ముసురు వాతావరణం నెలకొంది. సోమ, మంగళవారాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండటంతో తహసీల్దారు కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేశారు. తహసీల్దారు శైలాకుమారి ఇతర అధికారులతో కలిసి తోట్టు ప్రాంతాలను, తనియాలి వద్ద కాళంగిపై వంతెన పరిశీలించారు.

టీడీపీ కార్యకర్తకు ఆర్థిక సాయం

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చెన్నూరు గ్రామానికి చెందిన టీడీపీ మహిళా కార్యకర్త శంకరమ్మ అనారోగ్యంతో ఆదివారం మృతి చెందింది. ఆమె అంత్యక్రియలకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ రూ.5వేలు ఆర్థిక సాయం అందించారు. కార్యక్రమంలో అశోక్, కృష్ణమూర్తి, వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా శ్రీధర్‌రెడ్డి



కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం దొరువుకట్ట గ్రామానికి చెందిన టీడీపీ నాయకుడు మారంరెడ్డి శ్రీధర్‌రెడ్డి తెలుగు రైతు మండల అధ్యక్షుడిగా నియమితులయ్యారు. ఈ మేరకు టీడీపీ మండల అధ్యక్షుడు పలగాటి భాస్కర్‌రెడ్డి అధికారికంగా ప్రకటించారు. శ్రీధర్‌రెడ్డిని పార్టీ నాయకులు అభినందించారు.

బీచ్‌ల్లోకి నో ఎంట్రీ

కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలంలోని శ్రీనివాస సత్రం, గోవిందపల్లిపాళెం, యమదిన్నెపాళెం గ్రామాల సమీపంలోని బీచ్‌ల్లోకి సందర్శకులు వెళ్లకుండా మెరైన్ పోలీసులు ఆంక్షలు విధించారు. మెరైన్ సీఐ వెంకటేశ్వర్లురెడ్డి, ఎస్ఐ శివసౌమ్య, కోట ఎస్ఐ పవన్ కుమార్ ఆధ్వర్యంలో బీచ్‌ల్లోకి వెళ్లే దారులను మూసివేశారు.

గూడూరును తిరుపతితో కలిపిన పాపం వైసీపీదే

ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్



టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులతో ప్రమాణం చేయిస్తున్న ఎమ్మెల్యే పాశిం

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతిలో కలిపిన పాపం వైసీపీ ప్రభుత్వానిదేనని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. ఆదివారం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ అనుబంధ సంఘాల అధ్యక్షులు, సభ్యుల ప్రమాణ స్వీకారం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వం ప్రజాభిప్రాయానికి విరుద్ధంగా గూడూరు నియోజకవర్గాన్ని తిరుపతి జిల్లాలో కలిపిందని గుర్తుచేశారు. ఇప్పుడు వైసీపీ నేత, మాజీ ఎమ్మెల్యే ప్రసన్నకుమార్‌రెడ్డి మాట్లాడుతూ గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపేలా చొక్కాలు పట్టుకుని నిలదీయాలని అంటున్నారని, అప్పుడే ఆ పని ఎందుకు చేయలేదని సునీల్‌కుమార్ ప్రశ్నించారు. ఇప్పుడు మొసలికన్నీరు కారుస్తూ ఆమరణ నిరాహరదీక్ష చేస్తామని చెప్తే ప్రజలు నమ్మే పరిస్థితుల్లో లేరన్నారు. ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ అరాచక పాలన సాగించినందుకే ఎన్నికల్లో వైసీపీ ప్రజలు బుద్ధి చెప్పారన్నారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలపాలని తాను రెండుసార్లు అసెంబ్లీలో ప్రస్తావించడం జరిగిందన్నారు. మరోమారు ప్రజల ఆకాంక్షను ఇప్పుడు కూడా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, మంత్రి నారా లోకేశ్ దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. గూడూరును నెల్లూరు జిల్లాలో కలిపే వరకు తన పోరాటాన్ని ఆపబోనని, అవసరమైతే రాజకీయాల నుంచి తప్పుకుంటాని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో శీలం కిరణ్‌కుమార్, నెలబల్లి భాస్కర్‌రెడ్డి, శివకోటారెడ్డి, పులిమి శ్రీనివాసులు, అబ్దుల్‌రహీం, వాటంబేడు శివకుమార్, ఎల్లసిరి శ్రీనివాసులురెడ్డి, మట్టం శ్రావణి, జలీల్‌ఆహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

గూడూరును నెల్లూరులో కలిపే వరకు పోరాటం



రౌండ్‌టేబుల్ సమావేశంలో జేఏసీ నాయకులు

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): గూడూరును జిల్లా కేంద్రంగా ప్రకటించాలని, లేనిపక్షంలో నెల్లూరు జిల్లాలో కలపాలని జేఏసీ నాయకులు అన్నారు. ఆదివారం స్థానిక షాదీ మంజిల్‌లో వివిధ రాజకీయ పార్టీలు, స్వచ్ఛంధ సంస్థలు, ఉద్యోగ సంఘాల ఆధ్వర్యంలో రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గూడూరును తిరుపతి జిల్లాలో కలపడం వల్ల జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే ప్రజలు, ఉద్యోగులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. గత ఎన్నికల సమయంలో యువగళం పాదయాత్రలో నారా లోకేశ్, మహిళా సదస్సులో ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు గూడూరును నెల్లూరు జిల్లాలో కలుపుతామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు. ఆ మేరకు మాట నిలబెట్టుకోవాలని కోరారు. గూడూరు జేఏసీ ఆధ్వర్యంలో సోమవారం నుంచి ఆందోళన కార్యక్రమాలు చేపట్టి ప్రభుత్వానికి తమ ఆకాంక్షను తెలియజేస్తామన్నారు. అనంతరం ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో దశరధరామిరెడ్డి, మునిగిరీష్, జమాలుల్లా, వేగూరు రాజేంద్రప్రసాద్, శివకుమార్, చంద్రనీల్, నాగేశ్వరరావు, శశికుమార్, ప్రభాకర్, సునీల్, మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి జూడో పోటీలకు అంధుల జట్టు ఎంపిక



తిరుపతిలో జరిగిన రాష్ట్రస్థాయి జూడో పోటీల్లో పాల్గొన్న అంధులు

డక్కిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): రాజస్థాన్‌లో ఈనెల 19నుంచి 23వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి అంధుల జూడో పోటీలకు రాష్ట్ర జట్టును ఎంపిక చేసినట్లు రాష్ట్ర బ్లైండ్ స్పోర్ట్స్ అసోసియేషన్ అధ్యక్షుడు పరుచూరి పెంచల నర్సయ్య తెలిపారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ తిరుపతిలోని శ్రీనివాస స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో రాష్ట్రస్థాయి జూడో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఇందులో ప్రతిభ చూపిన వారిని జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక చేశామని చెప్పారు. కార్యక్రమంలో సంఘ వ్యవస్థాపక అధ్యక్షుడు ముప్పాళ్ల శేషగిరి, రాష్ట్ర ఎగ్జిక్యూటివ్ సభ్యుడు వాసుదేవరావు, కార్యనిర్వాహక సభ్యుడు రంగినేని రాజా పాల్గొన్నారు.

ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా విభజన జరగాలి

గూడూరు అర్బన్/డక్కిలి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): జిల్లాలు, డివిజన్ల విభజన ప్రజల అభిప్రాయాలకు అనుగుణంగా జరగాలని ప్రజాసంఘాల ఐక్యవేదిక వ్యవస్థాపక అధ్యక్షుడు గద్దల మునెయ్య అన్నారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ డివిజన్ల విభజనలో శాస్త్రీయ దృక్పధం లోపించిందన్నారు. భౌగోళికల పరిస్థితులు, ప్రజల మనోభావాలను పక్కనపెట్టి రాజకీయ కారణాలతో విభజించడం వల్ల ప్రజల్లో అసంతృప్తి, ఆందోళన నెలకొంటాయన్నారు. గూడూరు నియోజకవర్గంతో పాటు, రాపూరు, సైదాపురం, కలువాయి మండలాలను నెల్లూరు జిల్లాలో కలపాలని డిమాండ్ చేశారు.

వైభవంగా అయ్యప్పస్వామి పడిపూజ



మెట్లపూజ నిర్వహిస్తున్న అయ్యప్ప భక్తులు

నాయుడుపేట టౌన్, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): పట్టణానికి చెందిన ఆర్యవైశ్య సంఘ నాయకుడు కనమర్లపూడి సుబ్రమణి ఆధ్వర్యంలో ఆదివారం అయ్యప్ప స్వామి పడిపూజోత్సవం నిర్వహించారు. పట్టణంలోని గడియారం సెంటర్ సమీపంలోని కనమర్లపూడి నివాసం వద్ద అయ్యప్ప స్వామి పడిపూజ నిర్వహించారు. కార్యక్రమంలో సురేంద్ర, తంగరాజు, అయ్యప్ప భక్తులు పాల్గొన్నారు.

15, 16 తేదీల్లో ఛలో ఢిల్లీ

తిరుపతి(జీవకోన), నవంబరు 30(ఆంధ్రజ్యోతి): చట్టసభల్లో ఓబీసీలకు రిజర్వేషన్లు అమలు చేయాలని, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు జనాభా పరంగా రిజర్వేషన్లు కల్పించాలని, ఈ మేరకు పార్లమెంటు శీతాకాల సమావేశాల్లో బిల్లు ప్రవేశపెట్టాలని డిమాండ్ చేస్తూ ఈనెల 15, 16 తేదీల్లో చలో ఢిల్లీ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆ సంఘం జాతీయ అధ్యక్షుడు వరప్రసాద్‌యాదవ్ తెలిపారు. ఆదివారం తిరుపతి ప్రెస్‌క్లబ్‌లో ఆయన మాట్లాడుతూ 15న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మహాధర్నా, 16న ఏపీ భవన్‌లో జాతీయ సెమినార్ ఉంటాయని తెలిపారు. ఏపీ ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు 34శాతం రిజర్వేషన్లు అమలు చేసేలా కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని కోరారు.

పేదలకు దుప్పట్ల పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న అక్షయ సేవా సమితి సభ్యులు

వాకాడు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కోడివాక గ్రామంలో పేద వృద్ధులకు షిరిడీ సాయి అక్షయ సేవాసమితి ఆధ్వర్యంలో చిల్లకూరు సాయిరెడ్డి దాతృత్వంతో దుప్పట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు అల్లం రమణయ్య, కోటిరెడ్డి, బాబురావు, బాబురెడ్డి, అల్లం శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

గోవిందపల్లిపాళెంలో అంబళం పూజ

కోట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కోట మండలం గోవిందపల్లి పాళెం మత్స్యకార గ్రామంలో ఆదివారం రాత్రి అయ్యప్పస్వామి అంబళపూజ జరిగింది. స్థానిక రామాలయ ప్రాంగణంలో అయ్యప్ప స్వామికి పడి, మెట్ల పూజ చేశారు. కర్పూర హారతులు ఇచ్చారు. అయ్యప్ప భజనలు చేశారు. అయ్యప్పస్వామి చిత్రపటంతో గ్రామోత్సవం నిర్వహించారు.



అంబళంపూజ చేస్తున్న అయ్యప్ప భక్తులు

సెల్‌ఫోన్ చూడొద్దంటూ మందలించారని

ఉరేసుకొని బాలిక ఆత్మహత్య



మృతి చెందిన చిత్ర

తడ, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): నిత్యం సెల్‌ఫోన్ చూడటం మాని చదువుకోవాలని తండ్రి మందలించడంతో ఇంటర్మీడియట్ విద్యార్థి ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. తడ మండల పరిధిలోని కారూరు గ్రామానికి చెందిన సూళా కుమార్ బేల్దారి పనులు చేసుకుంటూ కుటుంబాన్ని పోషిస్తున్నాడు. ఆయనకు కుమారుడు నవీన్‌రాజు, కుమార్తె చిత్ర(16) ఉన్నారు. చిత్ర తమిళనాడు ఆరంబాకంలో ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతోంది. శనివారం ఉదయం 6 గంటల సమయంలో నిద్రలేచిన వెంటనే సెల్‌ఫోన్ చూస్తుండడంతో తండ్రి కుమార్ మందలించాడు. పొద్దున్నే సెల్‌ఫోన్ చూడకుండా చదువుకోవాలని చెప్పి పనికి వెళ్లిపోయాడు. కుమారుడు నవీన్‌రాజు బయటకు వెళ్లగా, తల్లి పక్కవీధిలో ఉన్న దుకాణంలో సరుకులు కొనుక్కోవడానికి వెళ్లింది. ఇంట్లో ఎవరూ లేకపోవడంతో చిత్ర చీరతో ఉరివేసుకుంది. కొంతసేపటి తరువాత వచ్చిన నవీన్‌రాజు ఇంటికి గెడియపెట్టి ఉండటంతో కిటికిలో నుంచి చూశాడు. ఉరివేసుకొని ఉన్న చెల్లిని చూసి పెద్దగా కేకలు వేయడంతో చుట్టుపక్కల వారు వచ్చి తలుపులు పగలగొట్టి లోనికి వెళ్లారు. కొన ఊపిరితో ఉన్న చిత్రను శ్రీసిటీ ఆస్పత్రికి తరలించారు. అనంతరం చెన్నైకు తీసుకెళ్లగా చిత్ర మృతి చెందినట్లుగా వైద్యులు తెలిపారు. తండ్రి కుమార్ ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

లాడ్జిలో అనుమానాస్పదస్థితిలో మహిళ మృతి



మృతి చెందిన మహిళ

సూళ్లూరుపేట, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): సూళ్లూరుపేట కచ్చేరి వీధిలోని రైల్వేగేటు సమీ పంలో ఉన్న ఓ లాడ్జిలో అనుమా నాస్పదస్థితిలో మహిళ మృతి చెం దింది. శనివారం రాత్రి తమిళనాడుకు చెందిన సుబ్రహ్మణ్యం అనే వ్యక్తి ఓ మహిళతో కలిసి సూళ్లూ రుపేట కచ్చేరివీధిలోని ఓ లాడ్జికి వచ్చారు. 101 నెంబరు గదిని అద్దెకు తీసుకున్నారు. ఆదివారం ఉదయం మహిళ బెడ్‌పై మృతి చెంది ఉండడాన్ని లాడ్జి సిబ్బంది గమనించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సీఐ మురళీకృష్ణ, ఎస్ఐ బ్రహ్మనాయుడు అక్కడకు చేరుకుని మృత దేహాన్ని పరిశీలించారు. గదిలో, పరిసరాల్లో మృతురాలికి సంబంధించి ఆధా రాలు ఏవీ లభించలేదు. సీసీ పుటేజీలను పరిశీలించగా జీఎన్‌టీ రోడ్డులోని వైన్‌షాపులో సుబ్రహ్మణ్యం మద్యం సీసా తీసుకుని లాడ్జికి చేరుకున్నారు. అతని వెంట మృతి చెందిన మహిళా కూడా ఉన్నట్లు గుర్తించారు. మృతు రాలు ఎరుపురంగు చీర, పసుపు రంగు జాకెట్ ధరించిన ఉంది. వయస్సు సుమారు 40 నుంచి 45 సంవత్సరాల మధ్య ఉంటుంది. మొబైల్ ఫోన్ ఆధా రంగా తమిళనాడులోని పొన్నేరి ప్రాంతానికి చెందిన వారుగా భావిస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

కాళంగి నది పరిశీలన



కాళంగి నదిని పరిశీలిస్తున్న తహసీల్దార్, మున్సిపల్ కమిషనర్

సూళ్లూరుపేట, నవంబరు 30(ఆంధ్రజ్యోతి): దిత్వా తుఫాన్ ప్రభావంతో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉండడంతో తహసీల్దార్ గోపినాధ్‌రెడ్డి, మున్సిపల్ కమిషనర్ చిన్నయ్య కాళంగి నది, నెర్రికాలువ, పాముల కాలువను పరిశీలించారు. పరివాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అవసరమైతే పునరావాస కేంద్రాలకు వెళ్లాలని సూచించారు. అనంతరం ఇలుపూరు - మంగళంపాడు గ్రామాల మధ్య ఉన్న డొండ కాలువను పరిశీలించారు. ఆదివారం అర్ధరాత్రి నుంచి భారీ వర్షాలు కురిసే అవకావం ఉండడంతో ప్రజలు జాగ్రత్తగా ఉండాలన్నారు. ఏ అవసరమొచ్చినా కంట్రోల్ రూంకు ఫోన్ చేయాలని కోరారు. సీఐ మురళీకృష్ణ గ్రామాల్లో పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): స్థానిక ప్రగతిసేవా సంస్థ ఆధ్వర్యంలో పొనకా మల్లికార్జున్‌రెడ్డి దాతృత్వంతో పేదలకు నిత్యావసరాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో సంస్థ అధ్యక్షుడు కడివేటి చంద్రశేఖర్, శ్రీనివాసులు, రాము, కుమార్, కరిముల్లా, పెంచలయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కదలలేని స్థితిలో ఉన్న ఏనుగు



కుంకీల సాయంతో రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్న అటవీశాఖ సిబ్బంది



పొక్లెయిన్ సాయంతో ఏనుగును బయటకు తీస్తున్న అధికారులు



ఏనుగును చూడటానికి వచ్చిన జనం

ఆపరేషన్ గజ

కాలు విరిగి చెరువులో ఇరుక్కుపోయిన ఏనుగు

కాపాడే ప్రయత్నంలో అటవీశాఖ

యాదమరి, నవంబరు 30 (ఆంధ్రజ్యోతి): కాలు విరిగి చెరువులో కదలలేని స్థితిలో ఉండిపోయిన ఒక ఏనుగును కాపాడేందుకు అటవీశాఖ ప్రయత్నిస్తోంది. వారం కిందట తమిళనాడు రాష్ట్రం నుంచి యాదమరి మండలంలోని కమ్మపల్లె అటవీ బీట్‌లోకి ఒంటరి ఏనుగు ప్రవేశించింది. అడవిలో జారిపడటంతో ఏనుగు కుడికాలు తొడభాగంలో ఎముక విరిగింది. అయినా కష్టంమీద తిరుగాడిన ఏనుగు శనివారం రాత్రి యాదమరి మండలం డీకే చెరువు సమీపంలోని గుడ్డివాని చెరువులోకి దిగింది. ఆ తర్వాత కదలలేక నీటిలోనే ఉండిపోయింది. ఆదివారం స్థానికులు గమనించి అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. జిల్లా అటవీశాఖ అధికారి శ్రీనివాసులు ఆధ్వర్యంలో సిబ్బంది వచ్చి పరిశీలించి ఏనుగును కాపాడేందుకు చర్యలు మొదలుపెట్టారు. పలమనేరు ముసలిమడుగు నుంచి కృష్ణ, అభిమన్యు అనే కుంకీ ఏనుగులను, మావటీలను రప్పించి మధ్యాహ్నం నుంచి కాపాడే ప్రయత్నం చేస్తున్నారు. ఎస్వీ జూపార్కు వైద్యులు డాక్టర్ అరుణ్, డాక్టర్ తోయిబా సింగ్ పర్యవేక్షణలో ముందుగా ఏనుగుకు నొప్పి నివారణ మందులు ఇస్తామని అటవీ అధికారులు తెలిపారు. అనంతరం మత్తు ఇంజక్షన్ ఇచ్చి పొక్లెయిన్ సాయంతో లారీలోకి ఎక్కించి తిరుపతి ఎస్వీ జూ పార్కుకు తరలించనున్నామని అనంతపురం సర్కిల్ సీసీఎఫ్ యశోదాబాయి తెలిపారు. కాగా ఈ ప్రక్రియను చూసేందుకు సమీప గ్రామాలకు చెందిన ప్రజలు భారీగా తరలివచ్చారు. అటవీ సిబ్బందికి ఇబ్బంది తలెత్తకుండా ఎస్ఐ ఈశ్వర్ చర్యలు తీసుకున్నారు. ఆదివారం రాత్రి పది గంటలైనా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. అటు తమిళనాడు అటవీశాఖ అధికారులు కూడా ఈ ప్రక్రియను పరిశీలిస్తున్నారు. మరోవైపు మండల సరిహద్దుల్లో బోడబండ్ల బీట్‌లో 13 ఏనుగుల గుంపు తిష్ట వేసి ఉన్నట్లు సమాచారం. దీంతో అటవీ సమీప గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డీఎఫ్‌వో శ్రీనివాసులు హెచ్చరించారు.